ANN తెలుగు


Follow: @ANNTELUGU

19-01-2026

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 24 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## హార్వర్డ్ విద్యార్థిలా సీఎం రేవంత్ రెడ్డి

### హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రత్యేక కోర్సులో చేరిన సీఎం రేవంత్

5 రోజుల పాటు కొనసాగనున్న 'లీడర్‌షిప్ ఫర్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ' కోర్సు

భారతదేశంలో ఇలాంటి కోర్సులో చేరుతున్న తొలి సిట్టింగ్ సీఎంగా గుర్తింపు

కోర్సు పూర్తయ్యాక హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకోనున్న రేవంత్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలో విద్యార్థిగా చేరనున్నారు. ఆయన 5 రోజుల పాటు జరిగే ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు తన పేరును నమోదు చేసుకున్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో పదవిలో ఉండగా ఒక ముఖ్యమంత్రి ఇలాంటి ఐవీ లీగ్ యూనివర్సిటీలో నాయకత్వ కోర్సు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. హార్వర్డ్ కెనెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో ఈ నెల 25 నుంచి 30 వరకు ఈ కోర్సు జరగనుంది.

మిగతా 2లో


**టాప్ న్యూస్**



### ఢిల్లీకి డీకే శివకుమార్

- దావోస్ పర్యటన రద్దు చేసుకుని పయనం
- మళ్లీ తెరపైకి సీఎం మార్పు


02



### అమెరికా ముందు ప్రధాని మోదీ తలవంచారు

- సీపీఐ నేత డి.రాజా

02



### ట్రంప్ ప్రకటనతో రచ్చ

- ఈయూ దేశాలపై టారిఫ్ లు విధించడంపై ఆగ్రహం
- చైనా, రష్యాకు పండగేనంటున్న ఈయూ

02



## కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశా..

### గూడెం మహిపాల్‌రెడ్డి యూటర్న్

**పటాన్ చెరు, మహా :** మున్సిపల్ ఎన్నికల వేళ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ముఖ్య అనుచరులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అప్పటి పరిస్థితుల వల్ల కాంగ్రెస్‌లో చేరాల్సి వచ్చింది. చేరినా ఏం లాభం జరుగలేదు. కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశాను. మూడుసార్లు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచా. ఇందులోనే ఉండి ఉంటే బాగుండేది. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. రేపు జరుగబోయే మున్సిపల్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి అని మహిపాల్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## ఏప్రిల్ 1 నుంచి టోల్ ప్లాజాలలో నగదు చెల్లింపులు బంద్..!

### కేంద్రం కొత్త రూల్

**న్యూఢిల్లీ, మహా :** భారతదేశంలో టోల్ విధానంలో మార్పులు చేస్తూ,ఏప్రిల్ 1 నుంచి జాతీయ రహదారి టోల్ ప్లాజాలలో నగదు చెల్లింపులను పూర్తిగా నిషేధించాలని కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. టోల్ గేట్ వద్ద వేచి ఉండే సమయాన్ని తగ్గించడానికి,ప్రయాణాన్ని క్రమబద్ధీకరించడానికి ఈ చర్యలు తీసుకుంటున్నారు. ప్రయాణికులు టోల్లు చెల్లించడానికి ఫాస్టాగ్ లేదా యూపీఐను మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ కొత్త నియమం అమలులోకి వచ్చిన తర్వాత వేగవంతమైన ప్రయాణం, ఇంధన ఆదా మరియు లావాదేవీలలో పారదర్శకత పెరుగుతుందని భావిస్తున్నారు.

### మీకు గొడవలుంటే

# తలుపులు మూసుకుని కొట్టుకోండి

### ఎన్టీవీ, ఏబిఎన్ యాజమానులకు సీఎం సూచన

## మంత్రులను బద్నాం చేయకండి

ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఫాం హౌజ్ లోని శుక్రాచార్యుడు ప్రయత్నిస్తున్నాడు

అడ్డగోలుగా మంత్రుల మీద వార్తలు రాయిస్తున్నారు

మా మంత్రుల మీద ఏదొచ్చినా రాసే ముందు నన్ను వివరణ అడగండి

ఖమ్మంలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**ఖమ్మం,మహా:** మీడియా యజమానులకు పంచాయతీ ఉంటే తలుపులు మూసుకుని వాళ్లూ వాళ్లూ కొట్టుకోవాలే తప్ప, తమ మంత్రులను బద్నాం చేయొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. సింగరేణి బొగ్గు గనుల టెండర్లు, మంత్రులపై ఇటీవల వస్తున్న వార్తా కథనాల నేపథ్యంలో ఖమ్మం వేదికగా సీఎం రేవంత్ స్పందించారు. ఆదివారం ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం పరోక్షంగా ఎన్ టీవీ, ఏబీఎన్ ఆంధ్ర జ్యోతి మీడియా సంస్థల యజమానులను ఉద్దేశించి ఆయా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజా పాలనను అందిస్తున్న తమ ప్రభుత్వాన్ని కుట్రలు, కుతంత్రాలతో పడగొట్టాలని ఫాం హౌజ్ లోని శుక్రాచార్యుడు ప్రయత్నిస్తున్నాడని సీఎం కేసీఆర్ ను ఉద్దేశించి ఆరోపించారు. ఇందులో భాగంగానే పత్రికల్లో, టీవీల్లో, సోషల్ మీడియా ద్వారా అడ్డగోలు ప్రచారం చేయిస్తూ మంత్రుల మీద వార్తలు రాయిస్తున్నారని అన్నారు. సింగరేణి బొగ్గుగనులకు సంబంధించి తమ ప్రభుత్వంలో అక్రమాలు, అవకతవకలు జరిగే అవకాశమే లేదన్నారు. సీనియర్ల సలహాలతో, సమన్వయంతో ప్రభుత్వాన్ని నడుపుతున్నట్లు చెప్పారు. కోల్ మైన్ టెండర్ల విషయంలో ప్రభుత్వం స్పష్టంగా, నిజమైన, నిఖార్సయిన, అనుభవం ఉన్నవాళ్లకే ఇస్తుందే తప్ప, అణా పైసా అవినీతికి అవకాశం ఇవ్వబోమని సీఎం స్పష్టం చేశారు.

**ఎలాంటి కాంప్రమైజ్ లేదు**

'అనవసరమైన, తప్పుడు ప్రచారాన్ని కల్పించడం ద్వారా, అపోహలు కలిగిస్తూ మళ్లీ శుక్రాచార్యుడు, మారీచుడు, సుబాహుడు బలపడడానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానే

మిగతా 2లో

## బీఆర్ఎస్ గద్దెలు కూలాలి

- ఆ పార్టీని భూస్థాపితం చేయడమే ఎన్టీఆర్ కు నివాళి
- ఖమ్మంలో సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు
- బిజెపిని ఖమ్మం ప్రజలు నిషేదించారు

**ఖమ్మం, మహా:** తెలంగాణలో టీడీపీ ఉండొద్దని కేసీఆర్ కక్షకట్టి ఆ పార్టీ నాయకత్వాన్ని దెబ్బతీశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌ను 100 మీటర్ల గొయ్యితీసి పాతిపెట్టడమే ఎన్టీఆర్‌కు నివాళి అని చెప్పకొచ్చారు.

మిగతా 2లో



## నా క్యారెక్టర్ అంత వీక్ కాదు

- టెండర్ల ఆరోపణలపై నిప్పులు చెరిగిన డిప్యూటీ సీఎం భట్టి
- మంత్రుల మధ్య పంచాయతీ పెడతామంటే సహించం
- కట్టుకథలు.. పిట్టకథలు అల్లి నన్ను వివాదంలోకి లాగారు

02



## మున్సిపల్ ఎన్నికలు

### జిల్లాల పునర్విభజనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

మేడారం సమ్మక్క సాక్షిగా మంత్రివర్గ సమావేశం


తెలుగురాష్ట్రాల చరిత్రలో తొలిసారి హైదరాబాద్ బయట కేబినెట్

**మేడారం, మహా :** మేడారం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగ్గా, పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మున్సిపల్ ఎన్నికలు, జిల్లాల పునర్విభజనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి రెండో వారంలో మున్సిపల్ ఎన్నికలకు నిర్వహణకు నిర్ణయం తీసుకుంది. ఇటీవలే రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపాలిటీల చైర్‌పర్సన్ల పదవులకు సంబంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. సామాజిక సమీకరణాలు, జనాభా ప్రాతిపదికన ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లను ముందుగా నిర్ణయించి.. అనంతరం లాటరీ పద్ధతిలో మహిళలకు.. బీసీలకు స్థానాలను కేటాయించారు. . జిల్లాల పునర్వ్యస్థీకరణపై రిటైర్డ్ జడ్జి, విశ్రాంత అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కనీసం ఆరు నెలల్లోగా రిపోర్ట్ ఇవ్వాలని కోరుతామని.. వాటి ఆధారంగానే మరోసారి జిల్లాలను శాస్త్రీయ విభజన చేస్తామన్నారు. గతంలో అశాస్త్రీయంగా జిల్లాల విభజన జరిగిందన్నారు. పక్కా ప్రణాళికతో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం జిల్లాల పునర్విభజన

మిగతా 2లో

## దేశ అభివృద్ధిలో బీహారీలది కీలక పాత్ర

### టీ హబ్‌లో జరిగిన బీహార్ డెవలప్ మెంట్ సమ్మిట్ 2025లో ఈటల హాట్ కామెంట్స్



**హైదరాబాద్, మహా :** దేశాభివృద్ధిలో బీహారీల పాత్ర అత్యంత కీలకమని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ హాట్ కామెంట్స్ చేశారు. ఆదివారం టీ హబ్‌లో నిర్వహించిన బీహార్ డెవలప్ మెంట్ సమ్మిట్ 2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ ప్రపంచానికి అన్నం పెట్టే స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. మోడీ పాలనలో గత 11 ఏళ్లలో భారతదేశ రూపురేఖలు పూర్తిగా మారాయని, ప్రపంచంలో దేశ గౌరవం మరింత పెరిగిందని ఈటల చెప్పారు. 2047 వికసిత భారత్ లక్ష్యంగా ప్రధాని కృషి చేస్తున్నారని, ఆ లక్ష్యం సాధించాలంటే రాష్ట్రాల అభివృద్ధి అవసరమని స్పష్టం చేశారు.

మిగతా 2లో

## రంగారెడ్డి జిల్లాను చార్మినార్‌లో కలిపితే సహించం

### ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



**హైదరాబాద్, మహా :** ప్రజాభిప్రాయం లేకుండా మున్సిపాలిటీల విభజన జరుగుతోందని చేవెళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రంగారెడ్డి చుట్టుపక్కల ఉన్న గ్రామాలతో పాటు అదిభట్ల, మహేశ్వరం, తుక్కుగూడ మున్సిపాలిటీలను చార్మినార్‌లో విలీనం చేస్తున్నారని మండిపడ్డారు.

మిగతా 2లో

## పట్నం బాట పట్టిన పల్లె..

### హైవేపై ఎక్కడ చూసినా వాహనాలే




**హైదరాబాద్, మహా :** సంక్రాంతి పండగ వేడుకలు ముగియడంతో సొంత ఊళ్లకు వెళ్లిన ప్రజలు తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఉద్యోగాలు, ఉపాధి, చదువుల కారణంగా హైదరాబాద్ వైపు భారీగా వాహనాలు కదలడంతో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి పూర్తిగా కిక్కిరిసింది. ఆదివారం అమావాస్య కావడం వల్ల ఎక్కువ మంది శనివారమే బయల్దేరారు. దీంతో ఉదయం నుంచే మొదలైన రద్దీ సాయంత్రం నుంచి రాత్రి వరకు తీవ్రంగా కొనసాగింది. ఉమ్మడి కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు, విశాఖ ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలు ఒకేసారి హైదరాబాద్ దారిలోకి చేరడంతో ట్రాఫిక్ తీవ్రత పెరిగింది. గుంటుపల్లి నుంచి ఇబ్రహీంపట్నం రింగు కూడలి వరకు కేవలం ఐదు కిలోమీటర్ల దూరం

మిగతా 2లో

ANN తెలుగు
# మహా పత్రిక
02
సోమవారం, హైదరాబాద్ | 19-01-2026 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

# బీఆర్ఎస్ గద్దెలు కూలాలి



(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ నేతలు గద్దెలు దిగాలి, ఊళ్లలో బీఆర్ఎస్ గద్దెలు కూలాలని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేయడమే ఎన్టీఆర్‌కు మనం ఇచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు. రైతులకు 9 గంటల కరెంట్ ఇచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదే అని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను పేద ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లాలో బీజేపీ ఆనవాళ్లు లేవని, బీజేపీ ఖమ్మంలోకి రాలేదని, ఆ జిల్లా ప్రజలు మొదటి నుంచి బీజేపీని నిషేధించారని సీఎం అన్నారు.

**పేదవారికి ఇల్లు ఇచ్చే బాధ్యత మాదే**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎవరికైనా డబల్ బెడ్‌రూమ్ ఇల్లు వచ్చిందా? అని సీఎం ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినట్లు తెలిపారు. పేదలకు ఇల్లు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం చూసుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పేదవాడిపై కుట్ర చేసి ఇళ్లు ఇవ్వకుండా అడ్డుకుందని నిప్పులు చెరిగారు. గత ప్రభుత్వం వారి మోచేతి నీళ్లు తాగాలి అన్నట్లుగా వ్యవహరించిందని ఘాటుగా వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రయాణం మొదట ఖమ్మం జిల్లాలోనే మొదలు పెట్టినట్లు సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. 200708లో ఖమ్మం జిల్లా మధిరలోని కొన్ని గ్రామాల్లో టీడీపీ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేవరకు ఖమ్మం జిల్లా ప్రజలు తనకు అండగా నిలబడ్డారని అన్నారు. గత ప్రభుత్వంలో రేషన్ కార్డు రావాలంటే ఉన్నవాళ్లలో ఎవరో చనిపోవాలనే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు లక్షలాది రేషన్ కార్డులను పేదలకు అందించినట్లు తెలిపారు. ఇంకా రాష్ట్రంలో ఎవరికైనా రేషన్ కార్డు రాకపోతే జారీ చేస్తామన్నారు. సన్న బియ్యం అందించి పేదవాడి ఆకలి తీర్చాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**ఆయన ఆశయాలను సాధించడమే నివాళి**

ఇవాళ నందమూరి తారక రామారావు వర్ధంతి అని ఆయన ఆశయాలను సాధించడమే ఘన నివాళి అని సీఎం చెప్పారు. మదరాసీలుగా ఉన్న తెలుగువారికి ఎన్టీఆర్ ప్రత్యేక గుర్తింపు తెచ్చారని, రూ.2 బియ్యంతో పేదోడికి తెల్లన్నం తినే అవకాశం కల్పించారని గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో తాము పేదోడికి సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. తెలంగాణలో ఎన్టీఆర్ అభిమానులు, చంద్రబాబు సహచరులు ఉన్నారని తెలిపారు. సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు రామసహాయం రఘురాం రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ ఛైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్ బాబు, నాయుడు సత్యనారాయణ, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మీకు గొడవలుంటే తలుపులు మూసుకుని కొట్టుకోండి

(మొదటిపేజీ తరువాయి)

సహకారం జేస్తుండ్రు. మీకూ మీకూ పంచాయితీలు ఉంటే తలుపులు మూసుకుని కొట్టుకోండి, లేకపోతే ఒకరిమీద ఒకరు బురద చల్లుకోండి.. అందులో మమ్మల్ని లాగి, ఆంబోతులు కొట్లాడుకుంటే లేగదూడల కాళ్లు ఇరిగినయట., ఇద్దరు మీడియా యజమానులు కొట్లాడుకుంటే మీరు కొట్లాడుకోండిగాని, మా మంత్రులను బద్నాం జేసే కార్యక్రమాన్ని మీరు తీసుకోకండి. దయచేసి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాస్తున్న రాతలు, చూపిస్తున్న చూపులు మారీచునికి, సుబాహునికి, శుక్రాచార్యునికి సహకారం అందించినట్లుగా ఉంటది. ఒక్కసారి ఆలోచన చేసి, వాస్తవాలను తెలుసుకుని, రాసేముందు మమ్మల్ని వివరణ అడగండి, తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రిగా రోజుకు 24 గంటలు, సంవత్సారానికి 365 రోజులు ప్రజా జీవితంలో ప్రజలకు అందుబాటులో ఉన్నప్పటికీ, మీడియాకు వివరణ ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నా. ఏదైనా వార్త ఏ పేపర్ లో వచ్చినా, టీవీలో వచ్చినా, సోషల్ మీడియాలో వచ్చినా., ఏ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, మంత్రిపై ఆరోపణ వచ్చినా, వాళ్లందరికీ నాయకుడిగా, కుటుంబ పెద్దగా అది నా గౌరవానికి భంగం కలిగిస్తుంది, నా నాయకత్వంపట్ల అపోహలను కలిగిస్తుంది. ఇలాంటి విషయాల్లో ఎలాంటి కాంప్రమైజ్ లేదు. మా మంత్రుల మీద ఏదొచ్చినా రాసే ముందు నన్ను వివరణ అడగండి.' అని సీఎం రేవంత్ రెడ్డి మీడియాను కోరారు.

# పట్నం బాట పట్టిన పల్లె..



(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణించేందుకు గంటన్నర సమయం పట్టింది. రింగు కూడలి వద్ద హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు ఒక వైపు, మైలవరం, తిరువూరు దిశగా మలుపు తిరిగే వాహనాలు మరోవైపు చేరడంతో పరిస్థితి అదుపు తప్పింది. జాతీయ రహదారిపై కార్లు వరుసగా నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనాలు కూడా ముందుకు కదలలేని స్థితి ఏర్పడింది. గొల్లపూడి నుంచి నందిగామ వరకు సర్వీస్ రోడ్లు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ హైవే వైపు మళ్లే వాహనాలకూ తీవ్ర ఆలస్యం తప్పలేదు.

**కీసర టోల్ ప్లాజా, నందిగామ వద్ద కొనసాగిన రద్దీ**

కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 20 వేల వాహనాలు వెళ్లినట్టు అధికారులు తెలిపారు. ఎనిమిది టోల్ కౌంటర్లు తెరిచినా ఫాస్టాగ్ స్కానింగ్ ఆలస్యం కారణంగా వాహనాలు పొడవైన వరుసల్లో నిలిచాయి. నందిగామ వైజంక్షన్ దగ్గర సర్వీస్ రోడ్డు మీదుగా వాహనాలను మళ్లించడంతో ముందుకు సాగేందుకు ఎక్కువ సమయం పట్టింది. అక్కడి ఫ్లైఓవర్ మీదుగా కార్లను మాత్రమే అనుమతించడంతో మిగతా వాహనాలకు మరింత జాప్యం ఏర్పడింది.

**ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు అప్రమత్తం**

ట్రాఫిక్ నియంత్రణ కోసం ఉన్నతాధికారులు నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు రహదారులపై మోహరించారు. సాయంత్రం సమయంలో కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి వచ్చే భారీ వాహనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. సాధారణ ప్రయాణికుల వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. డ్రోన్ల ద్వారా రహదారులపై పరిస్థితిని నిరంతరం గమనించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసు బృందాలను అక్కడికి పంపారు. నందిగామ వైజంక్షన్ వద్ద వేగం తగ్గించే స్టాపర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

**ప్రైవేటు ట్రావెల్స్‌కు డిమాండ్**

సంక్రాంతి ప్రభావంతో రవాణా వ్యవస్థలపై భారీ ఒత్తిడి ఏర్పడింది. రైళ్లలో రిజర్వేషన్లు దొరకకపోవడం, ఆర్టీసీ బస్సుల్లో టికెట్లు లభించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. పిల్లలతో ప్రయాణించాల్సిన కుటుంబాలు గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు కొన్ని మార్గాలకే పరిమితం కావడంతో పల్లె వెలుగు బస్సుల కోసం గ్రామీణ ప్రాంతాల్లో జనం పడిగాపులు కాశారు. పండుగ ముందు వరకు వెలవెలబోయిన బస్ స్టాపులు, రైల్వే స్టేషన్లు ఒక్కసారిగా జనంతో నిండిపోయాయి. ఈ పరిస్థితుల్లో ప్రైవేటు ట్రావెల్స్‌కు భారీగా డిమాండ్ పెరిగింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం వంటి నగరాలకు వెళ్లేందుకు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు కార్ల అద్దెలు కూడా గణనీయంగా పెరిగాయి. ఫలితంగా ఒక కుటుంబం హైదరాబాద్ చేరేందుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

### దిమ్మెలు టచ్ చేసి చూడు..

# దిమ్మతిరిగేలా బదులిస్తాం

**బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు**

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మంలో చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభా పక్ష డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ జెండా దిమ్మెలను కూల్చాలని, ఒక ముఖ్యమంత్రి బహిరంగంగా పిలుపునివ్వడం అంటే.. అది రాష్ట్రంలో శాంతిభద్రతలను ప్రత్యక్షంగా దెబ్బతీయడమే. ఇది నేరాన్ని ప్రోత్సహించడమేనని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ దిమ్మెలు కూలగొడితే రేవంత్ దిమ్మతిరిగేలా బదులిస్తాం, ప్రజాక్షేత్రంలో ప్రజల చేతనే గుణపాఠం నేర్పుతాము. తెలంగాణలో రాజ్యాంగం అమలవుతోందా లేక రేవంత్ రాజ్యాంగం నడుస్తోందా?' అని హరీష్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

# దేశ అభివృద్ధిలో బీహారీలది కీలక పాత్ర




(మొదటిపేజీ తరువాయి)

'వికసిత్ భారత్ కావాలంటే వికసిత్ బీహార్ కూడా కావాలి' అని మోడీ చెప్పిన మాటలను ఆయన గుర్తు చేశారు. దేశంలో వ్యవసాయం, డైరీ, పౌల్ట్రీ, మౌలిక సదుపాయాలు వంటి అనేక రంగాల్లో బీహారీల కృషి కన్పిస్తుందని ఈటల తెలిపారు. కరోనా సమయంలో తాను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో పనిచేస్తున్న బీహారీల సంఖ్య తెలిసి చలించిపోయానని, కాలినడకన స్వస్థలాలకు వెళ్తున్న వలస కార్మికులను చూసి కన్నీళ్లు వచ్చాయన్నారు. అప్పట్లో ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసి వారిని పంపించామని, కరోనా అనంతరం రైస్ మిల్లులు, ఆయిల్ మిల్లులు, రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు బిహారీ కార్మికులను తిరిగి తీసుకురావాలని అభ్యర్థించారని వివరించారు.

**తెలంగాణలో బీహారీలకు మద్దతు**

దేశంలో యువత జనాభా 26 శాతం ఉంటే, బీహార్‌లో అది 36 శాతం ఉందని లెక్కలు చెబుతున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి 202425 బడ్జెట్‌లో ప్రధాని మోడీ రూ.4 లక్షల కోట్లు కేటాయించారని తెలిపారు. తెలంగాణలో నివసిస్తున్న బీహారీలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. మల్కాజిగిరి మినీ ఇండియా లాంటిదని, అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారని ఈటల అన్నారు. బీహార్ ప్రజలు వికసిత్ బీహార్‌ను కోరుకుంటున్నారని అక్కడి ప్రజలు చెప్పినట్లు తెలిపారు. 'జంగల్ రాజ్ పోయింది' అన్న అభిప్రాయం ప్రజల్లో ఉందని, బీహారీల కట్టుబాటు, పని విధానం తనకు బాగా తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి వికాస్ వైభవ్, ఎమ్మెల్యే మిథిలేష్ తివారి, రాజీవ్ రంజన్ సింగ్, మాజీ ఎమ్మెల్యే లాలన్ కల్వర్, సయ్యద్ సమీద్, నవీన్ కుమార్ సింగ్, బినీత, సోనూ కుమార్ శర్మ, లవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ ప్రకటనతో రచ్చ

### ఈయూ దేశాలపై టారిఫ్ లు విధించడంపై ఆగ్రహం
### ..చైనా, రష్యాకు పండగేనంటున్న ఈయూ

**మహా:** గ్రీన్ లాండ్ ను అమెరికాలో కలిపేసుకోవాలన్న తన అభీష్టాన్ని వ్యతిరేకిస్తున్నాయని ఈయూ కూటమిలోని 8 దేశాలపై డొనాల్డ్ ట్రంప్ తాజాగా 10 శాతం టారిఫ్ లు విధించారు. అయితే, ఈ నిర్ణయాన్ని ఈయూ చీఫ్ లు తప్పుబట్టారు. ట్రంప్ బెదిరింపు సుంకాలపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో యురోపియన్ యూనియన్ దేశాల అత్యవసర భేటీకి పిలుపునిచ్చారు. ఈ మేరకు యురోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాండెర్ లాన్, యురోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా సంయుక్తంగా ఓ ప్రకటన జారీ చేశారు. ట్రంప్ ప్రతిపాదిత సుంకాలు సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈయూ - యూఎస్ సంబంధాలకు తీవ్ర విఘాతం కలిగిస్తాయని ఇందులో వారు హెచ్చరించారు. పరస్పర సహకారం తప్పనిసరిగా మారిన పరిస్థితుల్లో ఈ ధోరణి ఇరువైపులా నష్టం చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాలు ట్రాన్స్ అట్లాంటిక్ సంబంధాలను దెబ్బతీస్తాయని, వాణిజ్య అడ్డంకులకు ఊతమిస్తాయని చెప్పారు. 'యూరప్ ఐక్యంగా, సమన్వయంతో మరియు దాని సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవడానికి కట్టుబడి ఉంటుంది' అంటూ ఈయూ చీఫ్ లు ట్వీట్ చేశారు. మిత్రదేశాలతో కలిసి డెన్మార్క్ ఇటీవల గ్రీన్‌ల్యాండ్‌లో నిర్వహించిన సైనిక విన్యాసాలను కూడా వారు సమర్థించారు. ఆర్కిటిక్ ప్రాంతంలో భద్రతను పెంచడమే ఈ విన్యాసం ఉద్దేశమని స్పష్టం చేశారు. ఇది ఏ దేశానికీ వ్యతిరేకం కాదని తెలిపారు. డెన్మార్క్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ చర్చల ప్రాముఖ్యతను ఈయూ గుర్తుచేసింది. ఈ విషయంపై ఉర్సులా వాండెర్ లాన్ ఎక్స్ లో స్పందిస్తూ.. ప్రాదేశిక సమగ్రత మరియు సార్వభౌమాధికారం అంతర్జాతీయ చట్టం యొక్క ప్రాథమిక సూత్రాలని చెప్పారు. ఇవి యూరప్ తో పాటు మొత్తం అంతర్జాతీయ సమాజానికి అవసరమన్నారు. నాటో ద్వారా ఆర్కిటిక్‌లో శాంతి మరియు భద్రతపై మా ఉమ్మడి అట్లాంటిక్ ఆసక్తిని మేము నిరంతరం నొక్కిచెప్పామని వాండెర్ లాన్ పేర్కొన్నారు

# హార్వర్డ్ విద్యార్థిలా సీఎం రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ: కేయాస్, కాన్‌ఫ్లిక్ట్, అండ్ కరేజ్' (21వ శతాబ్దపు నాయకత్వం: అరాజకం, సంఘర్షణ, ధైర్యం) పేరుతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులో భాగంగా తరగతులకు హాజరవడం, అసైన్‌మెంట్లు పూర్తి చేయడం, హోంవర్క్ సమర్పించడం, గ్రూప్ ప్రాజెక్టులలో పాల్గొనడం వంటివి ఉంటాయి. వాస్తవ ప్రపంచంలోని సమస్యలను కేస్ స్టడీస్‌గా తీసుకుని, వాటికి పరిష్కారాలు కనుగొనడంపై ఈ కోర్సులో ప్రధానంగా దృష్టి సారిస్తారు. ఐదు ఖండాలకు చెందిన 20కి పైగా దేశాల నుంచి సీనియర్ నాయకులు, నిపుణులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత రేవంత్ రెడ్డికి హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి సర్టిఫికేషన్ లభిస్తుంది. పదవిలో ఉండగా హార్వర్డ్ సర్టిఫికెట్ అందుకోనున్న తొలి భారత ముఖ్యమంత్రిగా కూడా ఆయన నిలవనున్నారు. ఆధునిక నాయకత్వ విధానాలను అధ్యయనం చేసి, వాటిని తెలంగాణ పాలనలో అమలు చేయాలనే ఉద్దేశంతో రేవంత్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలుస్తోంది.

# మున్సిపల్ ఎన్నికలు



(మొదటిపేజీ తరువాయి)


ప్రక్రియ పూర్తి చేస్తామని స్పష్టత ఇచ్చారు. ఆదివారం కేబినెట్ సమావేశంలో దీనిపై నిర్ణయం జరిగింది.

**మహా జాతర ఏర్పాట్ల పరిశీలన**

అతిపెద్ద ఆదివాసీ పండుగ మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర కోసం జరిగిన ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి పరిశీలించారు. చరిత్ర చెదిరిపోకుండా, సంస్కృతి సాంప్రదాయం వర్ధిల్లేలా, భక్తుల విశ్వాసం ద్విగుణీకృతం అయ్యేలా... ఆచారాలు శాశ్వతంగా నిలిచేలా... సమ్మక్క సారలమ్మల వీర చరిత్ర మరో వెయ్యేళ్లైనా నిలిచిపోయేలా మేడారంలో ప్రజాప్రభుత్వం చేపట్టిన శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలను సహచర మంత్రులు, అధికారులతో కలిసి పరిశీలించినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జాతరకు సంబంధించి పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో సీసీ కెమెరాల అనుసంధానం, డ్రోన్ కెమెరాల వినియోగాన్ని ముఖ్యమంత్రి పర్యవేక్షించారు. భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో వాటి పనితీరును పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, కోమటిరెడ్డి, అజారుద్దీన్ , తుమ్మల నాగేశ్వరరావు తదితర 13మంది హాజరయ్యారు.



# రంగారెడ్డి జిల్లాను చార్మినార్‌లో కలిపితే సహించం



(మొదటిపేజీ తరువాయి)

రేవంత్ ప్రభుత్వం గ్రేటర్ నగరానికి మూడు కార్పొరేషన్‌లుగా చేసేందుకు ఓవైసీ హిల్స్‌లో విభజన జరుగుతుందని, అధికారులది ఇందులో ఏమాత్రం ప్రమేయం లేదన్నారు. పాతబస్తీలో కార్పేటర్‌సీట్లు పెంచుతూ విలీనం ప్రాంతాలను సీట్లు తగ్గిస్తున్నారని విమర్శలు చేశారు. గ్రేటర్‌రంగారెడ్డి కమిషనర్ ఏర్పాటు చేసే బాగుంటుందని, లేకుంటే ఎల్బీనగర్ , రాజేంద్రనగర్ లను మల్కాజిగిరి, మహేశ్వరం ప్రాంతాన్ని సైబారాబాద్‌లో కలపాలని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా సగం మజ్లిస్‌కు అప్పగించేందుకు ప్రయత్నం జరుగుతోందని, పాతబస్తీలో నల్లా, కరెంటు బిల్లు చెల్లించరని వారితో మా జిల్లా ప్రజలను ఎందుకు కలుపుతున్నారని ప్రశ్నించారు. మెజార్టీ హిందువులు నివసిస్తున్న గ్రామాలను చార్మినార్‌లో కలపడం సరైన విధానం కాదని, గ్రామాలను అందులో కలిపితే ఆ జిల్లా ప్రజల బతుకులు ఆగం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు ప్రదాన ఆర్థిక వనరు రంగారెడ్డి జిల్లానేని, ఆ జిల్లా ఖజానా మొత్తం గత పాలకులు దోచుకుని కేసీఆర్‌ఫామ్‌హౌజ్‌కు తరలించారని ఆరోపించారు.

# నా క్యారెక్టర్ అంత వీక్ కాదు

- టెండర్ల ఆరోపణలపై నిప్పులు చెరిగిన డిప్యూటీ సీఎం భట్టి
- మంత్రుల మధ్య పంచాయతీ పెడతామంటే సహించం
- కట్టుకథలు.. పిట్టకథలు అల్లి నన్ను వివాదంలోకి లాగారు

**హైదరాబాద్, మహా :** సింగరేణి బొగ్గు గని టెండర్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయంటూ వస్తున్న కథనాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. ఏబీఎన్ ఛానల్‌లో ప్రసారమైన ప్రత్యేక కథనం తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా ఉందని ఆయన మండిపడ్డారు. దిగజారుడు రాజకీయాల కోసం అబద్ధపు వార్తలు అల్లే సంస్కృతి తనది కాదని, తన క్యారెక్టర్ అంత వీక్ కాదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులు, ఆత్మను కాపాడటమే తన లక్ష్యమని తెలిపారు. ఆస్తుల సంపాదన కోసమో, వ్యాపారాన్ని విస్తరించుకునేందుకో రాజకీయాల్లోకి తాను రాలేదని అన్నారు. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల విషయంలో ఓ పత్రికలో అడ్డగోలు రాతలు రాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. నేరగాళ్ల నుంచి తెలంగాణ ఆస్తులను కాపాడతా : తెలంగాణ రాష్ట్ర ఆస్తులు, వనరులను సంరక్షించి, పేదలకు సమానంగా పంచడమే తమ లక్ష్యమని భట్టి విక్రమార్క వెల్లడించారు. సింగరేణి సంస్థ, నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లను పిలిచిందని అన్నారు. దీనిపై కట్టుకథ, పిట్ట కథలు అల్లి ప్రజలను మభ్యపెట్టేలా కథనం రాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే టెండర్లు పిలవాలని సింగరేణి సంస్థకు సూచించామని, తాను వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడిని కావడంతో ఆయనపై ఉన్న కోపం తన మీద చూపిస్తున్నారని అన్నారు. ఆ పత్రికలో వచ్చిన కథనం వెనక రాజకీయ ఉద్దేశం ఏమిటో తెలిశాక పూర్తి వివరాలు వెల్లడిస్తానని తెలిపారు. గద్దలు, దోపిడీదారులు, వ్యవస్థీకృత నేరగాళ్ల నుంచి తెలంగాణ ఆస్తులను కాపాడతానని ప్రకటించారు.

**ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా**

ఒకరి వ్యక్తిత్వాన్ని హననం చేసే కథనాలు రాసే అధికారం ఎవరికీ లేదని, నాయకుల మధ్య విభేదాలు సృష్టించేందుకు కట్టు కథలు రాశారని డిప్యూటీ సీఎం దుయ్యబట్టారు. దీనికి భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదని, సింగరేణి ప్రజల ఆస్తి అని, బొగ్గు గనులు ప్రజల ఆత్మ గౌరవమని, పదవుల కోసం కాదని, ప్రజాసేవ కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని పేర్కొన్నారు. టెండర్లను పిలిచింది సింగరేణి సంస్థేనని, మంత్రి కాదని గుర్తు చేశారు. క్లిష్ట ప్రాంతాల్లో గనులున్నందున ఫీల్డ్ విజిట్ నిబంధన తప్పనిసరి అని, ఇలాంటి నిబంధనలు కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఉన్నాయని తెలిపారు. ఓ ఛానల్ కథనంలో తన పేరును అనవసరంగా తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా సంస్థల మధ్య ఉన్న విషయాల్లోకి ప్రజా ప్రతినిధులను లాగొద్దని, వ్యక్తిగత వ్యవహారాల జోలికి వెళ్లడం తగదని సూచించారు.



### అమెరికా ముందు ప్రధాని మోదీ

# తలవంచారు

**సీపీఐ నేత డి.రాజా**

**ఖమ్మం, మహా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హిట్లర్‌లా మారిపోయాడు. నియంతలా మారి ప్రపంచ దేశాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ప్రధాని మోదీ అమెరికా ముందు తలవంచారు. భారత దేశ అభివృద్ధి కోసం మోదీ చేసింది ఏమీ లేదు. ఈ దేశంలో కమ్యూనిస్టులు ఇంకా ఉన్నారు. ట్రంప్ దమ్ముంటే నా దేశంపై పెత్తనం చేయండి' అని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా సంచలన వ్యాఖ్యలు చేశారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లాలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో పాల్గొన్న సీపీఐ కార్యదర్శి డి.రాజామాట్లాడుతూ.. భారత స్వాంతంత్ర్య ఉద్యమంలో సీపీఐ పార్టీ పాలు పంచుకుందని తెలిపారు. స్వాంతంత్ర్య ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమీ లేదని , ఆంగ్లేయులతో ఆర్ఎస్ఎస్ చేతులు కలిపిందని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# ఢిల్లీకి డీకే శివకుమార్

**మహా:** దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరంలో పాల్గొనాల్సిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన పర్యటనను అకస్మికంగా రద్దు చేసుకుని ఢిల్లీకి పయనమయ్యారు. ఉన్నట్లుండి డీకే ఢిల్లీ వెళ్లడంతో కర్ణాటక ముఖ్యమంత్రి మార్పు సంబంధించిన ఊహాగానాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. అయితే, ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన డీకే శివకుమార్ వీటిని తోసిపుచ్చారు. ఏదైనా శుభవార్త తెలిసినప్పటికీ దాని గురించి మాట్లాడటం తనకు ఇష్టంలేదని చెప్పుకొచ్చారు. అయితే తాము ప్రజల కోసం పనిచేసే వ్యక్తులమని, ఎప్పటికీ వారి మంచినే కోరుకుంటామని తెలిపారు. మీడియానే హైకమాండ్‌గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. జనవరి 16న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీతో డీకే శివకుమార్ భేటీ అయ్యారు. ఇపుడు అనూహ్యంగా పిలుపురావడంతో ఆసక్తికర చర్చ జరుగుతోంది.





# అథ్లెటిక్స్ పోటీల ప్రారంభానికి హాజరైన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి 11వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు.జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు అడ్డి భోజారెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసం తో ముందడుగు వెయ్యాలని కంది శ్రీనివాస రెడ్డి కోరారు. రాష్ట్ర స్థాయి లో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి లోను రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. 33 జిల్లాలనుండి వచ్చిన విద్యార్థుల మార్చ్ ఫాస్ట్ ని సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ గెడం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, గ్రంధాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్ పాల్గొన్నారు.

### కంది శ్రీనివాసరెడ్డిని కలిసిన


# నూతన సర్పంచులు

### ఘనంగా సత్కరించిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన నూతన సర్పంచులు గ్రామాల్లో మంచి అభివృద్ధి పనులు చేసి ప్రజల మనసులు గెలుచుకోవాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన పలువురు సర్పంచులు ఆదివారం కంది శ్రీనివాస రెడ్డిని కలిసేందుకు ఆయన క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. వారికి హార్థిక స్వాగతం పలికిన ఆయన అభినందనలు తెలియచేసి వారిని శాలువాలతో సత్కరించారు.ఈకార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ , ముడుపు దామెదర్ రెడ్డి , కొండ గంగాధర్, తుమ్మల వెంకట రెడ్డి, లోక ప్రవీణ్ రెడ్డి , కాళ్ల విఠల్,జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్ విలాస్ పాటిల్, నాగర్కర్ శంకర్,భూపల్లి శ్రీధర్, రాందాప్ నాక్లే,అల్చెట్టి నాగన్న, బొమ్మకంటి రమేష్, దీపక్ రావు, మినకు నారాయణ రెడ్డి , మహిపాల్ రెడ్డి సర్పంచులు గంటూబాయి, శంకర్ భోక్రె, పొచ్చిరాం , గంభీర్ ఠాక్రే, గడ్డం జగదీష్ రెడ్డి,వేణుగోపాల్ , ఇస్తారి ఉప సర్పంచులు గడ్డం గణపతి, నిమ్మల గౌతమ్ తదితరులున్నారు.

## డీసీసీ కార్యాలయాన్ని సందర్శించిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కలిసి పని చేస్తామని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్ లో గల డీసీసీ కార్యాలయాన్నిఆయన శ్రేణులతో కలిసి సందర్శించారు. డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ ను శాలువాతో సత్కరించి రాజ్యాంగ పుస్తకాన్ని బహురించారు. ఒకరికొరు మిఠాయిలు తినిపించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులమంతా ఓ కుటుంబమని ఏ సమస్య వచ్చినా కలిసి పరిష్కరించుకుంటామని ఏ ఎన్నిక వచ్చినా కలిసి పని చేసి పార్టీ అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తామని అన్నారు. తమ ముందున్న ప్రధాన లక్ష్యం మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక వార్డులు గెలిచి పరపాలక పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడమేనని అన్నారు.ఇందుకోసం అంతా కలిసి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసి దానికనుగుణంగా నడుచుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ , ముడుపు దామెదర్ రెడ్డి , కొండ గంగాధర్, లోక ప్రవీణ్ రెడ్డి , జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్ విలాస్ పాటిల్, అల్చెట్టి నాగన్న, బొమ్మకంటి రమేష్, దీపక్ రావు, శ్రవణ్ నాయక్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు..



### శతాబ్ది ఉత్సవాలకు

# మందమర్రి నుండి

**మందమర్రి, మహా :** ఖమ్మం జిల్లాలో జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ముగింపు ఉత్సవాలకు ఆదివారం మందమర్రి నుండి పలువురు పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మందమర్రి పట్టణ కార్యదర్శి కామెర దుర్గా రాజ్ మాట్లాడుతూ 1925 సంవత్సరం కాన్పూర్ లో సిపిఐ పార్టీ ఆవిర్భవించిందని చెప్పారు. నేటికీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అని కొనియాడారు. నిజాం నిరంకుశ పాలన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది ప్రాణ త్యాగాలు చేసి పది లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచిన పార్టీ సిపిఐ పార్టీ అని వెల్లడించారు. ఈరోజు అధికారంలో ఉన్న లేకున్నా పేదల పక్షాన పోరాడి ఎన్నో సమస్యలను పరిష్కరించింది మా పార్టీనని పేర్కొన్నారు. పీడిత ప్రజలకు విముక్తి కలగాలి అంటే పోరాటమే మార్గమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సమితి సభ్యులు ఆంటోనీ దినేష్, బండారి రాజేశం, తాళ్లపల్లి వీరయ్య, రొడ్డ నరేష్, ఉప్పులేటి తిరుపతి, ఎస్.కె మహబూబ్, దుర్గం రాజశేఖర్, జాడి రాజం, మేకల రాజేశం, చిల్ల పోచం, జాడి అవినాష్, అరుణ్ వేముల చాణక్య తదితరులు పాల్గొన్నారు.



### ఘనంగా ఎన్టీఆర్

# 30వ వర్ధంతి

**మందమర్రి, మహా :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని మందమర్రి పాత బస్టాండ్, జయశంకర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందమర్రి పట్టణ అధ్యక్షులు వాసాల సంపత్ మాట్లాడుతూ నాటి కాంగ్రెస్ నియంత్రణతో పాలను ఎదిరించి ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని పేర్కొన్నారు. రెండు రూపాయలకు కిలో బియ్యం, మద్యం నిషేధం, మండలాల ఏర్పాటు, మహిళలకు ఆస్తిలో వాటా లాంటి ఎన్నో హక్కులను ప్రజలకు అందించారని వెల్లడించారు. అనంతరం స్వర్గీయ మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కారం రాజు, మహిళా అధ్యక్షురాలు జూపాక సంధ్య, భూనేని సుగుణ, ఒడ్నాల సత్యనారాయణ, జె ఎస్ స్వామి, పారుపల్లి శీను, రాజేష్, గోపాల్, తిరుపతి, మల్లేష్, సదానందం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర లేని వారు దేశభక్తులా..?





- ప్రజల కోసం మరో వందేళ్లు పోరాటానికి సిద్ధం
- ట్రంప్ తీరును ఎర్ర జెండా అడ్డుకుంటుంది
- అమెరికాను ప్రశ్నించే శక్తిని మోడీ కోల్పోయారు
- సిపిఐ శతాబ్ది ఉత్సవ సభలో డి. రాజా

**ఖమ్మం , మహా:** చరిత్ర లేని వారు దేశభక్తులుగా చెప్పుకునేందుకు తాపత్రయ పడుతున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా ఆరోపించారు. వందేళ్లుగా ప్రజల పక్షాన పోరాడుతున్నామని భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు అత్యంత కీలక ఘట్టమని ఈ దేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు సభ సందర్భంగా ఖమ్మం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన పార్టీ కార్యకర్తలతో బహిరంగ సభా స్థలి కిటకిటలాడింది. తెలంగాణ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజా మాట్లాడుతూ వందేళ్లు త్యాగాలతోనే గడిచిపోయిందని అనేక మంది తమ త్యాగాలతో ఈ నేలను పునితం చేశారన్నారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్లో సిపిఐ ఆవిర్భావించిందని అంతకు ముందు 1985లో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం జరిగిందన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులకు మాత్రమే ఒక రాజకీయ చరిత్ర ఉందని వందేళ్ల చరిత్ర అని చెప్పుకుంటున్న ఆర్ఎస్ఎస్కు అసలు చరిత్ర లేదన్నారు. దేశ స్వాతంత్ర్యంలోనూ ఆ తర్వాత ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమిటని రాజా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కంటే ముందే సిపిఐ సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. దేశ చరిత్రలో అత్యంత కీలక ఘట్టమని రాజా అభివర్ణించారు. స్వాతంత్ర్య అనంతరం అనేక పరిణామాలలో కమ్యూనిస్టు పార్టీ అత్యంత కీలక భూమిక పోషించిందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నియంతగా వ్యవహరించాలని ప్రయత్నిస్తున్నాడని మరో హిట్లర్ కావాలనుకుంటున్నాడని ట్రంప్ను ఎర్ర జెండాలు ఎదుర్కొంటాయని రాజా స్పష్టం చేశారు. సామ్రాజ్యవాద ధోరణితో ట్రంప్ వ్యవహరిస్తున్నాడని ఆయన ఆరోపించారు. మెక్సికో, కోలంబియా, క్యూబా వంటి దేశాలకు బెదిరింపులు చేయడం అనుచితమన్నారు. రష్యా, ఉక్రేన్ యుద్ధాన్ని సాకుగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆధిపత్య ధోరణిని ప్రదర్శిస్తున్న ట్రంప్ను ప్రశ్నించే శక్తి భారత ప్రధాని మోడీకి లేదన్నారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తుందని దీనిని నిలిపివేయాలంటూ అమెరికా ఒత్తిడి తీసుకు రావడం శోచనీయమన్నారు. పాలస్తీనా అంశాన్ని ప్రస్థావిస్తూ పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఉండే హక్కు ఉందన్నారు. ఐక్యరాజ్యసమితి మద్దతు ఉన్న ద్విరాష్ట్ర పరిష్కారానికి సిపిఐ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. భారతదేశంలో మతోన్మాద శక్తులు విజృంభిస్తున్నాయని సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవుతుందని ఇది దేశ భవిష్యత్తుకు మరింత ప్రమాదకరమన్నారు. ఫాసిస్టు శక్తులను ఎదుర్కొనేందుకు అన్ని లౌకిక శక్తులు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బలమైన ఉద్యమ నిర్మాణాల ద్వారా మతోన్మాద శక్తులను అడ్డుకుంటామని రాజా ధీమా వ్యక్తం చేశారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాన్ని ప్రతిభింభిస్తూ జరిగిన భారీ బహిరంగ సభ నూతన ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. ఈ సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వాకాటి శ్రీహరి, సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్జిత్ కౌర్, గిరి శర్మ, అనిరాజా, ప్రకాష్‌బాబు, సందోష్‌బాబు, పల్లా వెంకటరెడ్డి, బినయ్ విశ్వం, రామకృష్ణ పాండా, కె. రామకృష్ణ, కుల్దేవ్, జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె. నారాయణ, సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తకెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటి నర్సింహా, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఎస్కో సాబీర్ పాషా, వనజా, నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఎంఎల్సి ఎన్. సత్యం, ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు వందేమాతరం శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నరేందర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ ట్రాఫిక్ చిక్కులకు యువ ఐపీఎస్‌లతో పరిష్కారం

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐపీఎస్ అధికారుల బదిలీలు చేపట్టారు. శనివారం వెలువడిన ఉత్తర్వుల్లో ముఖ్యమంత్రి ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. నగరవాసులను ఏళ్ల తరబడి వేధిస్తున్న ట్రాఫిక్ చిక్కులకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేసే యువ ఐపిఎస్ అధికారులను ప్రభుత్వం రంగంలోకి దించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి సైబర్ నేరాలను, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల సరఫరాను ఉక్కుపాదంతో అణచివేయాలని ముఖ్యమంత్రి పోలీసు అధికారులకు సూచించారు. ప్రస్తుతం, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టారు. ఆ దిశగా యువ ఐపిఎస్ అధికారులకు ఆ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతో పాటు కొత్తగా రూపుదిద్దుకుంటున్న 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ బదిలీల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. జిల్లాల్లో అదనపు ఎస్పీలుగా సమర్థవంతంగా పనిచేస్తున్న యువ అధికారులను ఎంపిక చేసి, వారికి నగరంలో ట్రాఫిక్ డీసీపీలుగా పోస్టింగులు ఇచ్చారు. ఈ బదిలీల్లో భాగంగా కొత్తగూడెం ఆపరేషన్స్ అదనపు ఎస్పీగా ఉన్న అవినాష్ కుమార్ ను హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి 1 (ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు) గానూ, ఉట్నూరు అదనపు ఎస్పీగా ఉన్న కాజల్ ను హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి 2 (గోల్కొండ, జూబ్లీహిల్స్ జోన్లు) గానూ నియమించారు. అదేవిధంగా జగిత్యాల అదనపు ఎస్పీ ఎస్. శేషాద్రిని రెడ్డిని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి2 (కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు) బాధ్యతల్లోకి తీసుకురాగా, భువనగిరి అదనపు ఎస్పీ కనకాల రాహుల్ రెడ్డికి మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ డిసిపి 1 బాధ్యతలు అప్పగించారు. ములుగు జిల్లా ఆపరేషన్స్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న శివం ఉపాధ్యాయను ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' కమిషనరేట్ ట్రాఫిక్ డిసిపిగా నియమించడం విశేషం. రైల్వేలో డిఐజి హోదాలో ఉన్న జి. చందనా దీప్తిని ఫ్యూచర్ సిటీ అడ్మిన్ మరియు ట్రాఫిక్ అదనపు సీపీగా నియమించగా, హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా ఉన్న బికే రాహుల్ హెగ్డేను అదే కమిషనరేట్ లో ట్రాఫిక్ డిసిపి3 (చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లు) గాను, సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా ఉన్న జి. రంజన్ రతన్ కుమార్ ను అక్కడే ట్రాఫిక్ డిసిపి 1 (శేరిలింగంపల్లి జోన్) గాను ప్రభుత్వం బదిలీ చేసింది. అదేవిధంగా, రాష్ట్రవ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా వంటి అక్రమాలను అడ్డుకునేందుకు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ లో డిఐజి గా అభిషేక్ మహంతిని నియమించారు. తద్వారా సహజ వనరుల లూటీని అరికట్టడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా కఠిన చర్యలు చేపట్టనున్నారు. మొత్తంగా చూస్తే, తాజా ఐపిఎస్ అధికారుల బదిలీల్లో అటు అనుభవానికి, ఇటు యువత ఉత్సాహానికి సమ ప్రాధాన్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### మద్యం షాపు ల సమయపాలనలో

# తగ్గేదేలేదు

### మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**నల్గొండ , మహా :** మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. మునుగోడు నియోజ కవర్గంలో మద్యం దుకాణాల సమయపాలనలో ఎమ్మెల్యే విధించిన ఆంక్షలు కొనసాగుతున్నాయి. అయితే తాజాగా మద్యం షాపుల వేళల్లో తాను విధించిన నిబంధనల విషయంలో తన అభిమతాన్ని పునరుద్ఘాటించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న మద్యం షాపుల సమయపాలనలో మార్పు ఉండబోదని మరోమారు స్పష్టం చేశారు. ఆదివారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని కలవడానికి వచ్చిన కొంతమంది మద్యం వ్యాపారులతో మద్యం షాపుల సమయపాలనపై, మద్య నియంత్రణపై వెనకడుగు వేయబోమని స్పష్టం చేశారు. మీ వ్యాపారాల కోసం ప్రజల ఆరోగ్యాలు పాడుచేయొద్దని, ఉదయం నుండి మద్యం తాగే విధానానికి స్వస్తి పలికేలా మద్యం వ్యాపారులు తమ మైండ్ సెట్ మార్చుకోవాలని హితవు పలికారు. నియోజకవర్గంలో మద్యం షాపుల విషయంలో తాను తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే వైన్ షాపులు తెరుచుకోవాలని 6 గంటల తర్వాతే పర్మిట్ రూముల్లో అనుమతి ఉండాలన్నారు. అవసరమైతే నియోజకవర్గంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను ఇంకా పెంచుతామని, ఉదయమంతా పని చేసుకొని సాయంత్రం పూట మాత్రమే తాగేలా మార్పు తీసుకొస్తున్నామన్నారు.

# నేడు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు ఇంచార్జి మంత్రి



**ఆదిలాబాద్ మహా :** రాష్ట్ర ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ ఉమ్మడి ఆదిలాబాద్ ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.30 కు కాగజ్‌నగర్ కు చేరుకుంటారు. పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్ గెస్ట్ హౌస్‌లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు కాగజ్‌నగర్‌లో నూతన ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశ కార్యక్రమం, యెల్లగూడ తోటలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేయనున్నారు.అక్కడే బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం జిల్లాలోని వాంకిడి మండలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన, కేజీబీవీ వాంకిడి లో అదనపు తరగతి గదుల ప్రారంభం, జెడ్‌పీఎస్ఎస్ వాంకిడి కలాన్‌లో బాలుర హాస్టల్ భవనానికి శంకుస్థాపన, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల ప్రారంభోత్సవాలు, జైత్‌పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. తర్వాత సాయంత్రం 5.45 కు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీకి శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఆసిఫాబాద్ రోస్ గార్డెన్‌లో జరిగే మార్కెట్ కమిటీ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతారు.అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.మంత్రి పర్యటనను పురస్కరించుకుని అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు

ANN తెలుగు
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 19-01-2026



# ఒక యువకవికి...

మేమిచ్చే సలహాలను నమ్మకు
వాటిని మరిచిపోయి,
నువ్వే మొదటిసారి లేదా ఆఖరుసారి
కవిత్వం రాస్తున్నట్టుగా
నీ సొంతమాటల నుండి మొదలు పెట్టు

నువ్వు మా రచనలు చదువుతుంటే
అవి మా అభిప్రాయాల పొడగింపులు
కాకూడదు
మా వెతల పుస్తకం లోని తప్పులను
సరిదిద్దే అవసరం ఉన్న రాతలు కావాలి

నేనెవరిని అని ఎవరినీ అడగకు
నీ తల్లి ఎవరో తెలుసు నీకు
ఇక తండ్రి అంటావా?
నీకు నువ్వే తండ్రివి అయిపో

సత్యం తెల్లనిది; దానిమీద
కాకిలాంటి నల్లని సిరాతో రాయాలి నువ్వు
సత్యం నల్లనిది; దానిమీద
ఎండమావుల వెల్తురుతో రాయాలి నువ్వు

డేగతో పోటీ పడదల్చుకుంటే
నువ్వు డేగతో పాటు పైకెగరాలి

నువ్వు ఒక స్త్రీని ప్రేమిస్తే
ఆమెకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూసుకో

జీవితం మనం అనుకునేదానికన్న
తక్కువ ఉల్లాసకరమైనది, తక్కువ పుష్టమైనది
కానీ మన భావోద్వేగాల పటుత్వం
చెడకూడదని
దాని గురించి అతిగా ఆలోచించం మనం

రోజాపువ్వు గురించి చాలా సేపు ఆలోచిస్తే
నువ్వు తుఫానులను ఎదుర్కొనలేవు

నువ్వూ నాలాంటివాడివే
కానీ నా అగాధం స్పష్టమైనది
ఐతే నీ దగ్గర అనంతమైన రహస్యాలు గల
దారులున్నాయి
అవి కిందికీ మీదికీ కదుల్తుంటాయి
యవ్వనానంతర దశ
ప్రతిభకు విజ్ఞతకు పరిపక్వత
అని అనుకోవచ్చు నువ్వు
ఔను, అది విజ్ఞత అనేదాంట్లో అనుమానం లేదు
భావోద్వేగాల అజమాయిషీ లేని స్వేచ్ఛాయుత విజ్ఞత

మామూలు పక్షులు వేయి అయినా
చెట్టును దాల్చిన ఒక్క పిట్టకు సమానం కావు

కష్టకాలంలో రాసిన కవిత
మరుభూమిలో మనోహరమైన పుష్పగుచ్ఛం

ఉదాహరణగా నిలవడం సులభం కాదు
కాబట్టి, నువ్వు నువ్వుగానే ఉండిపో
కానీ అరువు తెచ్చుకున్న భాషకు ఆవల,
నువ్వు కాకుండా భిన్నంగా ఉండు

ఉత్సాహానికీ ఉద్రేకానికీ గడువుతేదీ ఉంటుంది
కానీ దాని వ్యవధి కూడా విశాలమైనది
కాబట్టి, నీ హృదయాన్ని ఉత్సుకతతో నింపుకో
నీ దారిని చేరుకునే ముందు దాన్ని
అనుసరించు

నువ్వే నేను నేనే నువ్వు అనకు ప్రియురాలితో.
దానికి వ్యతిరేకంగా, మనమిద్దరం
పరారీలో ఉన్న మేఘానికి అదనపు అతిథులం అను

నీ శక్తినంతా కూడగట్టుకుని
నియమాన్ని ఉల్లంఘించు

ఒక్కమాటలో రెండు నక్షత్రాలను దూర్చకు
ముఖ్యం కానిదాన్ని, ఉత్సాహం ఉప్పొంగడం
కోసం
ముఖ్యమైనదాని పక్కన పెట్టకు

మా సలహాల కచ్చితత్వాన్ని నమ్మకు
యాత్రికుల పారవశ్యాన్ని మాత్రమే నమ్ము

కవిహృదయం లోంచి తూటా లాగా
నీతివాక్యం వినాశకరమైన విజ్ఞత.
కోపంతో ఉన్నప్పుడు ఎద్దులాగా బలంగా,
ప్రేమిస్తున్నప్పుడు బాదంపువ్వు లాగా
మృదువుగా ఉండు
మూసిన గదిలో నీకోసం నువ్వు పాట
పాడుకుంటున్నప్పుడు
శూన్యాన్ని ఆవాహన చేసుకో

నీ మార్గం ప్రాచీనకవి ఎంచుకున్న రాత్రి లాగా
బహు దీర్ఘమైనది; అందులో పర్వతాలు
మైదానాలు నదులు లోయలు ఉంటాయి
నీ స్వప్నపు కొలత ప్రకారం నడువు
ఒక మల్లెపూవు లేదా ఉరికొయ్య
నిన్ను అనుసరిస్తుండవచ్చు

నీ పనుల గురించి నేను దిగులు పడను
తమ పిల్లల సమాధుల మీద నర్తించేవాళ్ల గురించి,
కళాకారుని నాభిలోని రహస్య కెమెరాల
గురించే నా దిగులు

నువ్వు ఇతరుల నుండీ నానుండీ
దూరంగా జరిగితే నన్ను నిరాశపరచవు
నాలాగా లేనిదే ఎక్కువ అందమైనది

ఇకమీదట, ఉపేక్షింపబడిన భవిష్యత్తే
నీ అసలైన రక్షకుడు

నువ్వు కొవ్వొత్తిలాగా విషాదాశ్రువులు
కార్చుతున్నప్పుడు
నీ సహజ జ్ఞానపు కాంతిని ఎవరు చూస్తున్నారు
లేక ఎవరు అనుసరిస్తున్నారు అని ఆలోచించకు
ఇదంతా నాదేనా అని నీ గురించి నువ్వు ఆలోచించు

కవిత ఎప్పుడూ అసంపూర్ణమైనదే
సీతాకోకచిలుకలు దాన్ని సంపూర్ణం చేస్తాయి

ప్రేమలో అనుభవం తప్ప సలహాలుండవు
కవిత్వంలో బోధనలు ఉపదేశాలు ఉండవు
ప్రతిభ మాత్రమే ఉంటుంది

చివరగా, తక్కువ ముఖ్యం కానిది
నా సలాం

**అరబిక్ మూలం:** మహ్మూద్ దార్విష్
**ఆంగ్లానువాదం:** ఫాడీ జూడా
**తెలుగు అనువాదం:** ఎలనాగ

# రామా చంద్రమౌళి కవిత్వంలో మనిషి



తెలుగు సాహిత్యంలో కొత్తగా పరిచయం అక్కర్లేని వ్యక్తి రామా చంద్రమౌళి గారు. ఓరుగల్లు జిల్లాకు చెందిన వీరు ఇప్పటివరకు 34 నవలలు, 8 కథా సంపుటాలు, 15 కవితా సంపుటాలతో పాటుగా మూడు విమర్శ గ్రంథాల రచించి పాఠకులలో చెరుగని ముద్రను సంపాదించుకున్నారు. గ్రీసులో జరిగిన 22వ వరల్డ్ కాంగ్రెస్ పోయేట్స్ 2011 సదస్సు, 2010, 2011, 2012 లో జరిగిన సార్క్ సాహిత్య శిఖరాగ్ర సదస్సు, తైవాన్ లో జరిగిన 35వ ప్రపంచ కవుల సమ్మేళనం, 2014, 2015 లో జైపూర్ లో జరిగిన అంతర్జాతీయ సూఫీ కవి సమ్మేళనంలో వీరు భారతదేశ ప్రతినిధిగా పాల్గొని తెలుగు సాహిత్యానికి అంతర్జాతీయ కీర్తిని తెచ్చిపెట్టారు. వీరి సాహిత్య సేవకు, కృషిగాను అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి. ముఖ్యంగా అమెరికా, కెనడా, గ్రీస్, జర్మనీ, శ్రీలంక, సింగపూర్, నేపాల్ వంటి అనేక దేశాలలో ఒక కవిగా సందర్శించి, వివిధ విశ్వవిద్యాలయాల్లో ప్రసంగించి అనేక జాతీయ, అంతర్జాతీయ కవిత్వ వేదికలపై తన కవిత్వాన్ని వినిపించడం విశేషం.

"కవి చూపు వేరే ఉంటుంది. పరిశీలన వేరే ఉంటుంది. కవి అధ్యయనమూ భిన్నంగా ఉంటుంది. ఈ భిన్నమైన దృష్టివల్ల, స్పందనవల్ల, తాదాత్మ్యత వల్ల కవి తనకు తాను ఒక ప్రపంచమై తన చుట్టూ వున్న తానులేని ఇతర సమస్త శేషప్రపంచాన్నీ తన కవితావస్తువుగా చేసుకుని ఈ తోటి మానవ సమూహాలకు, సమాజానికి, దేశానికీ, వెరసి సర్వమానవజాతికీ ప్రయోజనకరమైన ఒక కొత్త ప్రతిపాదనను, ప్రత్యామ్నాయాన్నీ, పర్యాయాన్నీ ఆవిష్కరిస్తూ కవి అంటే ఓ మానవీయ వ్యక్తీకరణగా నిర్వచించబడుతాడని" రామా చంద్రమౌళి అంటారు. ఈ కవితాత్మకమైన తాత్త్విక అభివ్యక్తి పరిపూర్ణమూ, పరిపుష్టమూ, సమగ్రమూ కావాలంటే కవి ఎప్పటికప్పుడు తననుతాను ఆధునీకరించుకుంటూ మానవ సమూహానికి ఒక సాంస్కృతిక నాయకత్వం వహిస్తున్న ఆదర్శజీవిగా తననుతాను నిర్మించుకుంటూ, తననుతాను ఎప్పటికప్పుడు పునర్నిర్వచించుకుంటూ జీవితాన్నే కవిత్వంగా జీవించవలసి ఉంటుందని పేర్కొంటాడు. అట్లా తనను తాను ఎప్పటికప్పుడు పునర్నిర్మించుకుంటూ జీవితాన్నే కవిత్వంగా జీవిస్తున్న వ్యక్తిగా మనకు రామచంద్రమౌళి కనపడతాడు.

రామచంద్రం మౌళి కవిత్వంలో 'మనిషి' అనేకంగా కనిపిస్తాడు. మనిషి రూపం, నడవడి, ప్రేమ, తత్వం, పయనం, విపరీత బుద్ధులు, పోకడలు తదితర అనేక విషయాలు వారి కవిత్వమంతా పరుచుకొని ఉంటాయి. మనిషి తనను తాను ఎట్లా నిర్మించుకోవాలో, పునర్నిర్మించుకోవాలో, ఎలాంటి స్పృహ కలిగి ఉండాలో, తనలోని ఖాళీలను ఒక్కొక్కటిగా ఎలా పూరించుకుంటూ ముందుకు పయనించాలో కనబడుతుంది. తనలోకి తాను తొంగి చూడడం, అర్థవంతంగా జీవించడం, మరణించడం, చూపును విస్తరించడం, లోతుల్ని తరిచి తరిచి చూడడం, అన్వేషణ కొనసాగించడం, బలహీనతల గురించి తెలుసుకోవడం, ఓటములను అధ్యయం చేయడం, తనలో నుండి తనను మేల్కొని బయటికి రావడం, ఇతరుల యొక్క అంతరాన్ని తెలుసుకోవడం, వ్యాపించడం, వంతెనను నిర్మించడం లాంటి అనేక అంశాలతో మనిషిని నిర్వచిస్తూ, విలువల్ని బోధిస్తూ తనదైన తత్వంలోకి వారి కవిత్వం ప్రయాణిస్తుంది.

ఎవరికైనా తనను తాను నిర్మించుకోవడమంటే తనను తాను తెలుసుకొని తను కానీ ప్రపంచం గురించి తెలుసుకోవడం అంటాడు ఈ కవి. గమ్యం స్పష్టంగా తెలిస్తేనే తను దారి తప్పడం గురించి తెలుసుకుంటాడనే ఎరుకను మనకు కలగజేస్తాడు. తెలుసుకోవడం ప్రారంభమైన తర్వాత పాతది కూడా సరికొత్తగా కనబడుతుంది. మనిషి తెలుసుకోవడమనే ఒక స్పృహ కలిగి ఉంటే చివరికి మృత్యువు ఎదుట నిలబడ్డా నవ్వుతూ కరచాలనం చేస్తూ వెంట నడిచిపోతాడని, "కొత్తగా తెలిసేది/ఇప్పటి ముగింపంటే రేపటి ఆరంభం అనే 'స్పృహ'/.. యిక తలెత్తి చూస్తే/ఎదుట 'మృత్యువు' నిలబడ్డా/కరచాలనం చేసి కలిసి నవ్వుతూ వెంట నడిచిపోవడమే" అంటూ మనిషికి కనీసం తన గురించి స్పృహ కావాలంటాడు. తనను తాను తెలుసుకుంటే పక్క మనిషి కూడా అర్థమవుతామవుతాడనే ఆశ కవిలో కనబడుతుంది. తెలుసుకోవడం ఒక 'నిషా' గా తను వ్యక్తీకరిస్తాడు.

తెలుసుకోవడం ఒకటే కాదు, ఉన్నతంగా లక్ష్యించడం నేర్చుకోవాలి, లేదా సామాన్యంగానైనా జీవించడానికి సిద్ధం కావాలి. అయితే జీవించడంలో అడుగులు తడబడడం సహజం. అయినా ఫర్వాలేదు, పడనీ.. అంటాడు ఈ కవి. హృదయంలో శూన్యం చోటు చేసుకుంటే ఎంత అందమైన అడవి అయినా చంద్రుడు లేని ఆకాశం లా మిగిలిపోతుందంటూ మనిషికి నిండైన హృదయం ఉండాలనే విలువను గొప్పగా చాటుతాడు.

మరీ, జీవించడానికి సిద్ధమైనప్పుడు ఏం చేయాలి?? ప్రతిస్పందించడం నేర్చుకోవాలి. గమ్యం చేరడానికి దారి కనుక్కోవాలి. అవసరమైతే ఆ దారిని ఏర్పరిచి ఆ దారిలో పయనించాలి. ప్రతి మనిషికి పయనించడమే జీవితం అని చెప్పి చివరిదాకా పయనించి, పయనించి చివరికి నీలోకి నీవు పయనించాలనే ఎరుకను తన కవిత్వంలో కలిగిస్తాడు ఈ కవి. అలా పయనించడమే నిజమైన ప్రయాణమని, అప్పుడే విజయం చేకూరుతుందని చెబుతాడు. అయితే ఇదంతా 'ట్రిగ్గర్ నొక్కబడక ముందే జరగాలి ఏదైనా' అని ఒక జాగురతను తెలియజేస్తాడు. అంటే ఏదైనా చేజారిన తర్వాత తిరిగి తెచ్చుకోలేని పరిస్థితులు వస్తాయి. కాబట్టి గమ్యం చేరడానికి ముందే దారిని ఏర్పరుచుకొని మనిషి పయనించాలని స్పష్టం చేస్తున్నాడు.

మనిషి కాగితాల కట్టల్లో భూమిని చుట్టుకుని ఎలా బంధిస్తూ విపరీత పోకడలను కొనసాగిస్తున్నాడో తన 'భూమి దుఃఖం' కవిత చెబుతుంది. "సెక్రటేరియట్ గేట్ బయట/ఐటి విటులచే బహిరంగ భూమానభంగం జరుగుతుంది' అంటూ 'నగ్నభూమికి యిప్పుడు/జానెడు అచ్ఛాదన కావాలి" అని దుఃఖిస్తాడు. ఆ దుఃఖంలోంచి.."నడుస్తున్నప్పుడు మనిషికి నిర్వచనం రెండడుగులు/నడక ముగిసిన తర్వాత/మనిషికి నిర్గమనం ఆరడుగులు, ఒక పిడికెడు మట్టి" అంటూ మనిషికి చివరికి ఏం మిగులుతుందో తెలియచేస్తాడు. నువ్వు ఎంత భూమిని ఆక్రమించి విర్రవీగిన ఆఖరికి కలిసేది ఈ మట్టిలోనే అనే ఒక సత్యాన్ని ఈ కవిత ఎరుక చేస్తుంది. అందుకే ఇలాంటి అస్తవ్యస్త జీవితము జీవించే కంటే అర్థవంతంగా జీవించి, మరణించడమే మేలు అంటూ విలువైన విషయాన్ని చెబుతాడు.

'మనిషే ఒక మహా రహస్యం' అని కుండలు బద్దలు చేస్తాడు ఈ కవి. పరులను వినడం, వ్యూహించడం, కుట్రించడం, పైకి ప్లాస్టిక్ పూవై నవ్వడం, భార్య, ప్రేయసి, స్నేహితుడు, సహోద్యోగి తదితరుల వద్ద గింజలు చల్లి, వల పన్ని పిచ్చుకలను పట్టే పథక రచన చేసి కావాల్సిన లబ్ధి పొందుతున్నాడని మనిషి పోకడలను బయటపెట్టాడు. అందరినీ మోసం చేస్తూ ఒక వ్యూహాత్మక రహస్యమైపోతున్నాడని అంటున్నాడు. మరి కవి ఏం చేయగలుగుతాడు?? మనిషిలో ఒక మార్పు రావాలని కలగంటాడు. విపరీత పోకడలు తొలగిపోవాలని అనుకుంటాడు. అందుకే "మనిషి ఒక మహా రహస్యం కాకుండా/ఒట్టి కాగితం లా బట్టబయలైతే ఎంత బాగుండు ను" అనే ఆశావాద దృక్పథాన్ని ప్రకటిస్తాడు.

సంభాషించలేకపోవడమంటే మరణించడమే అంటూ సంభాషణ యొక్క విలువను, అవసరాన్ని గొప్పగా, చాలా అర్థవంతంగా తెలియజేస్తాడు కవి. "సంభాషించు.. నిరంతరం.. నిర్విరామంగా.." అంటాడు. సంభాషణకు భాష అవసరం లేదని, గాలి భాష, పక్షి భాష, నీటి భాష, నిప్పు భాష, సముద్ర భాష, మట్టి భాష, నీలి ఆకాశపు నిశ్శబ్ద భాష.. ఇవన్నీ భాషలే కదా అంటాడు. పిచుకలు ఉదయమే కిటికీలోంచి నీతో సంభాషిస్తాయి, శీతాకాలపు పొగ మంచు నీతో సంభాషిస్తుంది కదా అంటాడు. "ఒక ఖాళీసీసా, ఒక శిథిల దుర్గం, ఒక చిరిగిన గాలిపటం/ఒక విసిరేసిన సిరంజీ, ఒక తీగలు తెగినపోయిన వీణ/చెదరిన సాలెగూడు... స్తంభించిన చేనేత మగ్గం/... అన్నీ ఎంత దుఃఖంతో విషణ్ణమై సంభాషిస్తాయో విను/ఏ భాష అది... అంటూ ఆఖరికి దుఃఖానికి కూడా భాష ఉందని తెలియజేస్తాడు. కాబట్టి స్నేహితుడా సంభాషించు.. ఏదో ఒక నిసర్గభాసతో సంభాషిస్తూనే ఉండు, నిన్ను నువ్వు సజీవంగా నిర్మించుకోవడానికి సంభాషిస్తూనే ఉండని, సంభాషించలేకపోవడమంటే మరణించడమే అని స్పష్టం చేస్తాడు.

'వై దిస్ కొలవెర్రి' కవిత మనిషి కలతలను, వెతలను, వెర్రితనాన్ని, ఉరుకుపరుగుల బతుకులను బట్టబయలు చేస్తుంది. మనిషి రాక్షస మదన క్రీడల వినోదాలు, విశృంఖలమైన స్వేచ్ఛను ప్రశ్నిస్తుంది. చదువును 'కొంటూ' మోసం చేయబడే వ్యవస్థను కళ్ళ ముందు చూపెట్టి చివరికి 'నిన్ను చచ్చేంత సిగ్గు చంపేసింది కదా' అంటూ అస్తవ్యస్తమైన విద్యా విధానాన్ని అర్థవంతంగా మనిషిని మేలుకొలుపు దిశగా ఈ కవిత ఒక చూపునిస్తుంది. అయితే ఆ చూపుల వైశాల్యాలు తెలియాలంటే మనిషి లోతుల్లోకి దిగాల్సిందే అంటాడు. అట్లా దిగుతున్న ప్రతిసారి వెతుకులాట ప్రారంభమవుతుందని, ఆ వెతుకులాటలో బహిర్, అంతర్ లోకాలను అనుసంధించుకుంటూ వెళ్తున్నప్పుడు మనిషిని శాసించేన్నీ ఆ భౌతిక నిగూఢ చేష్టలేనని స్పష్టీకరిస్తాడు.

సూర్యుడు అస్తమిస్తేనే కదా మళ్లీ ఉదయిస్తాడు. అందుకే ఈ కవి 'అస్తమించని సూర్యుడు మళ్ళీ ఉదయించడు' అంటాడు. ఈ విషయాన్ని మనిషి గమనించాలని అంటాడు. మనిషి దేన్నైనా ఎప్పుడు ప్రారంభించాలో తెలియాలి. అంతకంటే సమయోచితంగా ఎప్పుడు ముగించాలో తెలియాలని తత్వాన్ని బోధిస్తాడు."ఖాళీ చేయడమంటే/మనిషి వెళ్ళిపోతూ మరో మనిషికి జీవితాన్నివ్వడం" అంటూ తాత్వికతంగా చెబుతాడు.

మనిషి అంటే ఒక సెల్ నంబరై, ఒక యూజర్ ఐడీ ఐ జీవితమంటే పెళ్ళానిక్కూడా చెప్పలేని పాస్వర్డయి బతుకు కొత్త కరెన్సీ నోట్ల రెపరెపలౌతున్నపుడు అన్నీ రహస్యాలే, అన్నీ అదృశ్య కవచంలోకి నిష్క్రమణలే అంటాడు. రాత్రుళ్ళు నిద్రించేందుకనీ, పగళ్ళు పని చేసేందుకనీ మరిచి మనిషే ఒక 'ఔట్ సోర్సింగై' మిథ్యగా మిగులుతున్నవేళ జీవించడమంటే మరణించడమని పునర్నిర్వచించవలసి వస్తుందా..? అని నేటి మనిషి తత్వాన్ని, స్థితిగతులను చక్కగా తన కవిత్వం ద్వారా వ్యక్తీకరిస్తాడు.

మొత్తంగా రామచంద్రమౌళి కవిత్వంలో మనిషి కేంద్రీకృత అంశాలు ఎక్కువగా చోటు చేసుకొని పాఠకులకు ఓ 'చూపు' ను కలుగజేస్తుంది. మనిషికి సహనం, ద్రవించి ప్రవహించే హృదయం ఉండాలనే బోధన, తనలో తాను తొంగి చూసుకోవడం, తనను తాను కనుక్కోవడం, వెతుకులాడడం, సంభాషించడం లాంటి ఒక 'స్పృహ' తన కవిత్వం ద్వారా వ్యాప్తి చెంది ఆలోచనలో పడేస్తుంది. తద్వారా మనిషిలో ఒక మార్పుకు నాంది పలుకుతుంది. ఈ సందర్భంగా మనిషితనాన్ని, తత్వాన్ని కవిత్వంలో చాల చక్కగా, అర్థవంతంగా ఆవిష్కరిస్తూ, అంతే అర్థవంతంగా పయనిస్తున్న రామాచంద్రమౌళి గారు ఇటీవల 'అజోవిభో' అవార్డు అందుకున్న సందర్భంగా వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.


**- బిల్ల మహేందర్, 9177604430**

# అక్షరాలతో నిప్పులు కురిపించిన పప్పుల రాజిరెడ్డి

తెలంగాణ జీవితమంతటినీ నిలువెత్తుగా నింపుకున్న తెలంగాణ భాషను శ్వాసగా నిలుపుకున్న, వ్యవస్థపై ధిక్కార స్వరాన్ని వినిపించిన కాళోజీ నారాయణరావు పేరిట ఇచ్చే అవార్డును కొత్త అనిల్ నేతృత్వంలోని తెలంగాణ రచయితల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ తేది. 25122025న పప్పుల రాజిరెడ్డికిచ్చి గౌరవించింది. కాళోజీ అవార్డుకు అర్హత పొందిన పప్పుల రాజిరెడ్డి కవిత్వంలోని గొప్పతనమేమిటో పరిశీలిద్దాం.

''సంకెళ్లను ఛేదించే ప్రతిఘటనా పిడికిళ్ల నినాదం మా కవిత్వం / తెలంగాణ పల్లెల కల్లోల హృదయం మా కవిత్వం / అడవులు మా కవిత్వం / ఆయుధాలు మా కవిత్వం / ప్రజలు మా కవిత్వం / ప్రజావీరులు మా కవిత్వం.'' ఇదీ రాజిరెడ్డి కవిత్వ వరుస. ''నా అక్షరాల గొంతును నులిమేసినా / నా పాటల చరణాల్ని తెగ్గొట్టినా / నా పిడికిళ్ల కాంతిని నియంత్రించినా / నా పదచిత్రాల కళ్లు పెరికేసినా / వాటిని పునర్నిర్మిస్తుంటాను''. ఇదీ ఆయన ఆత్మవిశ్వాసం. తలలో నాలుకైన పాట గ్రామాల మీంచి, గూడేల మీంచి, పొలాల మీంచి, కలాల మీంచి, మట్టి మీంచి పారుతుంది. పాట చావదు. నాగేటి చాలై నవ్వుతుంది. ఇదీ ఆయన ధీమా. ''మట్టి గర్భంలోంచి మంకెన పూ మొక్కలా దూసుకొస్తాను / వ్యవస్థ గుండెలదిరేలా కల్లోల కెరటమవుతాను / సాగర సంగీత మేళంలో రేలపాట పాడుతాను''. ఇదీ ఆయన తీరు. ఇతడు ఉప్పెనై ఉరుమై మేఘమై మెరుపై అడివై ఆయుధమై ఏర్రై తల్లి వేర్రై నరనరాన ప్రవహించే రుధిరమై ఆ ప్రవాహంలో తేలిపోతాడు. ఇతని కవిత్వంలో ఖడ్గ హృదయం కరచాలనం చేస్తుంది. పక్షులు కువకువలతో స్వరచాలనం చేస్తాయి. చెమట నదుల హృదయాలు జీవనోత్సాహంతో ఉరకలెత్తుతాయి.

పాలు కారాల్సిన బుగ్గలు గొర్ల కాస్తూ బతుకు గొంగడి బుజానేసుకొని చెట్టూ పుట్టతో చెలిమి చేస్తుంటే, బలపాలు పట్టాల్సిన చేతులు బరిగె పట్టి పశువులను కాస్తుంటే తల్లడిల్లుతాడు. ''మీ లేలేత శరీరాల కాయ కష్టాన్ని నిస్సిగ్గుగా దోచేస్తూ / మీ కలల తలకాయల్ని తప్పదీస్తున్న ఈ పాపిష్టిలోకం క్షమార్హం కాదు'' అని ఆగ్రహిస్తాడు. పద్నాలుగేళ్లయినా నిండని పనిమనిషి ఇరవై గజాల బావిలోంచి కష్టాన్ని తోడి బకెట్లలో నింపుతుంటే, అంట్లగిన్నెల సంగీతంతో బతుకు పాట నేరుస్తుంటే చూడలేక, ఆమె ఆలోచన ఎదగాలని, జీవన మూల్యాల మొగ్గ విచ్చుకోవాలని కోరుకుంటాడు. అణచి వేయబడుతున్న స్త్రీలనుద్దేశించి ''కష్టాల ముళ్ల కిరీటాన్ని ఇంకెంతకాలం భరిస్తావు? అడ్డుగోడల్ని బద్దలు చేయి, స్వేచ్ఛా గాలుల జయకేతనం




ఎగురవేయి'' అని సాహసాన్ని నూరిపోస్తాడు. ఇల్లు గుల్ల చేస్తున్న, కుటుంబాలను ఛిద్రం చేస్తున్న మద్యం మహమ్మారి గురించి రాస్తూ ''మత్తు స్పర్శ లేని జగత్తు కోసం మనమంతా ఒకటవుదాం / బీడువడ్డ జీవితాల్లో వసంతాన్ని మొలిపిద్దాం'' అని ఉద్బోధిస్తాడు. ''అభ్యర్థి ఏ పార్టీవాడని కాదు ఏపాటివాడో చూడు'' అన్నాడు కాళోజీ. అదే బాటలో ''ఓటు వేసే ముందు నిజా నిజాలు తెల్సుకొని ఓ నిర్ణయానికి రావాల్సింది మనమే / ఈ రాజ్యం మనది హక్కులు మనవి నిర్ణయాధికారం కూడా మనదే'' అని ఎరుకపరుస్తాడు రాజిరెడ్డి. మగవాళ్లను గుడ్డిగా నమ్మి, ప్రేమ పేరుతో మోసపోయే ఆడవాళ్ల నుద్దేశించి ''కత్తి లేకుండా, రక్తం అంటకుండా / హంతకుడు విసిరిన యమపాశం ప్రేమ / గాలానికి ఎర అయ్యావా / వాని కామాగ్నికి సమిధవౌతావు'' అని హెచ్చరిస్తాడు.

198090 దశకంలో కలం పట్టిన కవులు కొందరు అడవిబాట పట్టిన మనుషుల గురించి రాశారు. రాసిన వాళ్లలో రాజిరెడ్డి ఒకడు. ఈయన అందులోని సాధక బాధకాలనూ రాశాడు. అడవిబాట పట్టినవాడేమంటాడు? ''చెట్లల్ల కెందుకురా అంటే చెట్లే నిజాయితీ మెట్లంటాడు / అడివైనా వెందుకురా అంటే అడివే నా అమ్మంటాడు / అడివంత పచ్చగా స్వేచ్ఛగా బతకటమే బతుకంటాడు'' నిజమే కావచ్చు. కానీ వాళ్ల ఆశయం నెరవేరుతున్నదా? సమాజంలో అవినీతి అక్రమాలు అరాచకాలు తగ్గాయా? అలా కానప్పుడు నిరర్థక త్యాగాలెందుకు? కొందరిని చంపడమెందుకు? చావడమెందుకు? వాళ్లను కన్నవాళ్ల కడుపు కోత ఎవరు తీరుస్తారు? ''కొడుకా! మా ముద్దుల బంగారు కొండా! నువ్వు లేవని ఏడ్వాలా? బతుకీదలేక చావాలా? చేతకాని ఈ ముసలి పీనుగలను ఉద్ధరిస్తావనుకున్నాం. కలో గంజో తెచ్చి కంచాన పెడతావనుకున్నాం. మా కళ్లముందు పిల్లాపాపల్తో సుఖంగా ఉంటావనుకున్నాం. మా బతుకెట్ల గడవాలిరా! మాకు పొద్దెట్ల పోవాలిరా? నువ్వే చెప్పాలిరా'' అని ఏడ్చేవాళ్లను ఎవరు ఓదారుస్తారు? 'వరదగూడు' కవితా సంపుటంలో ఆవేశంలో అక్షరాలతో నిప్పులు కురిపించిన పప్పుల రాజిరెడ్డి ఆనవాలు, గంగాళం కవితా సంపుటులలో ఆలోచనకు ప్రాధాన్యమిచ్చాడు. పాఠకులనూ ఆలోచనలో పడేశాడు. వర్తమాన పరిస్థితిని పరిశీలించాడు. మనుషుల తీరుతెన్నుల్ని గమనించాడు.

మనం మనుషులమేనా? మనుషులుగా మనగల్గుతున్నామా? మనమెటు పోతున్నాం? మన తరమేమవుతుంది! మన గోతిని మనమెలా తోడుకుంటున్నాం? రక్తం తాగనేర్చిన మనుషుల్ని చూస్తున్నాం. మనిషితనం లేని దొల్ల మనుషుల సమూహం హింసే పరమావధిగా ప్రవర్ధమానమవుతున్నది. మనిషికీ మనిషికీ మధ్య వస్తు సంబంధమే రాజ్యమేలుతున్నది. కన్నతల్లి వంటి చెరువు, కల్పవృక్షం వంటి ఊరు, పాడి బర్రె వంటి వాగు ధ్వంసమవుతున్నయ్. రియల్ ఎస్టేట్ పేరిట ''శిఖం మాయం / గుట్ట మాయం / కుంట మాయం / తేడా వస్తే మనిషి మాయం''.

మరి మనమేం చేయాలి? ఎవరికి తోచిన రంగాలలో మనిషి ఉద్ధరణకు, మానవతా వికాసానికి పాటుపడాలి. అందుకే పప్పుల రాజిరెడ్డి కవిత్వం రాస్తాడు. ఎవరి పేరిట రాజిరెడ్డి పురస్కారం అందుకున్నాడో, ఆ కాళోజీ గురించీ కవిత రాశాడు. అంతే కాదు. పల్లె పాటకు ప్రాణ పరిమళమద్దిన, పాటకు పాలు తాపి ఉగ్గు వెట్టి శిక్షణనిచ్చి జనబాణీలో వినిపించిన గూడ అంజయ్యను కొనియాడినాడు.

ఇంత బాగా వచన కవితలు రాసిన రాజిరెడ్డి భక్తి, దేశభక్తి, సామాజికత నిండిన పద్యాలూ రాసినాడు. అదే 'పద్య నీరాజనం' అయింది.

మొత్తం మీద రాజిరెడ్డి కవిత్వాన్ని చదివితే, ఆయన ఏం చెప్పదలచుకున్నాడు?

''స్పందనా స్పర్శా లేని మనిషి వొక మనిషేనా? తడీ తపనా లేని హృదయం వొక హృదయమేనా? ప్రేమా జాలీ లేని బతుకు ఒక బతుకేనా? ఒక మంచిమాట కోసం, ఒక ఆప్యాయతా పిలుపుకోసం, ఓ చల్లని స్పర్శ కోసం, ఓ చల్లని కరచాలనం కోసం బతుకుదాం''. ఇదీ ఆయన కవితల సారాంశం. ఇంతమంచి ఆశయం కోసం కవిత్వం రాసిన రాజిరెడ్డికి అభినందనలు.

**- ఎ. గజేందర్ రెడ్డి, 9848894086**

# సంతకం

ఒక కవితను చదివాను
పక్కనే దానికిజతైన బొమ్మనూ చూశాను
బొమ్మలోనూ కవిత అగుపడింది అచ్చంగా
గీసినతను కవితలో నిండా మునిగి వచ్చి
ఆ తడితోనే గీసినట్టున్నాడు
అక్షరాలలో అంతర్లీనమైన
కదలికలు సైతం బొమ్మలోకొచ్చాయి
కవితా , బొమ్మా
బింబప్రతిబింబాల్లా వున్నాయి

ఇంతకీ ఎవరు గీశారు ఆ బొమ్మను ?
బొమ్మ అడుగున ఏ సంతకమూ లేదు
అల్లికగానైనా పొడిగానైనా
ఆఖరికి ఒక అక్షరంగా అయినా, ఒక
ఆనవాలుగా –
ఎట్లా తెలిసేది అతనెవరో

కవితలో మునిగి వచ్చాక
బొమ్మను రూపు గట్టే పనిలో మునిగి పోయి
అతనొక ఋషిగా రూపొంది వుంటాడు

పూర్తయాక ఆ తన్మయ ఘడియల్లో
సంతకం చేయాలనే తలపేఅతనికి రాలేదా
లేక
బొమ్మ ఏకాగ్రతను సంతకం
భగ్నపరుస్తుందనుకున్నాడా
లేక
తన బొమ్మే తన సిసలైన సంతకమని
సంభావించాడా
లేక
పూర్తయింది కనుక ఇక ఆ బొమ్మే తనది
కాదనుకున్నాడా
లేక
ఆ ఋషిత్వ ఘడియల్లో అసలు తన పేరే
మరచిపోయాడా ఏమో !

**-దర్భశయనం శ్రీనివాసాచార్య,**
**94404 19039**

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# మహిళ అదృశ్యం

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**



**వరంగల్ మహా;** వరంగల్ మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెల్లొట్లు సురేష్ వయసు 20 సం. వృత్తి సెక్యూరిటీ గార్డ్ తన తల్లి పుష్పలత జంపయ్య వయసు 42 సం. (మున్సి పాలిటీ వర్కర్) అయిన ఈమె గత శనివారం ఇంటి నుండి ఉదయం11 గంటల సమయంలో వెళ్లిపోయి, ఇప్పటి వరకు తిరిగి రాలేదని పోలీసులకు ఆమె కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లి ఇంటి నుండి వెళ్ళేటప్పుడు లైట్ గ్రీన్ కలర్ చీర, బ్లూ కలర్ బ్లౌజ్ ధరించి, సుమారు 5 అడుగుల ఎత్తు, చామన చాయ కలిగి ఉంటుంది. కాగా ఇంట్లో నుండి వెళ్ళిన అనంతరం ఎక్కడ ఉన్నారో తెలియదని, పూర్వం కూడా ఆమె ఇలాగే వెళ్ళి రెండు మూడు రోజుల పాటు ఇంటికి రాలేదని సురేష్ తెలిపాడు, కాగా ఈ సారి వారం రోజులు అయిన ఇంటికి రాలేదని అందుచేత పోలీసులకు ఫిర్యాదు చేయగా స్పందించిన మట్వాడ పోలీసులు దర్యాప్తులో భాగంగా ఆమెను వెతకడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు మాట్లాడుతూ ఎవరైనా ఈ మహిళను చూసినా సమాచారం తెలిసిన వెంటనే మట్వాడ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు.

# మంత్రి కోమటి రెడ్డికి స్వాగతం పలికిన నాయిని



## నియోజకవర్గంలో రోడ్లు, భవనాల అభివృద్ధి పై చర్చ

**హన్మకొండ మహా;** మేడారం జాతర సందర్భంగా ఆదివారం మేడారంలో నిర్వహించిన కాబినెట్ సమావేశం, ఆలయ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల నిమిత్తం హనుమకొండకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హనుమకొండ లోని ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకున్న మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన రోడ్లు, భవనాల అభివృద్ధి పనుల పై ప్రత్యేకంగా చర్చించారు. నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రధాన రహదారుల విస్తరణ, అంతర్గత రోడ్ల అభివృద్ధి, ప్రభుత్వ భవనాల నిర్మాణం, పెండింగ్ లో ఉన్న రోడ్డు పనుల వేగవంతం వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో రోడ్లు అభివృద్ధి పనుల ప్రాదాన్యత క్రమంలో పనులు త్వరగా చేపడతామని, అవసరమైన నిధులు కూడా మంజూరు చేసి పనులు వేగవంతం చేస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామ్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వరరావు, కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడ్డ కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు..

- తప్పకుండా న్యాయం జరుగుతుంది..
- ఎవరూ నిరుత్సాహ పడవద్దు..
- ఆర్థికంగా రాజకీయంగా కార్యకర్తలు అన్ని విధాలా అభివృద్ధి చెందేలా చూస్తా..
- ప్రమాణం చేసి చెబుతున్నా..
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు..
- 29వ డివిజన్లో బస్తీ బాట.. డివిజన్ కార్యాలయం ప్రారంభం..



**కరీంనగర్ మహా :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులు కార్యకర్తలకు తప్పకుండా నామినేటెడ్ పదవులు దక్కుతాయని వారి శ్రమ కష్టం వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్రావు పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కష్టపడ్డ వారందరికీ తగిన న్యాయం చేస్తుందని అందుకు తాను ముందుండి అన్ని విధాలా సహకరిస్తానని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవులు దక్కేలా ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు. ఆదివారం సాయంత్రం కరీంనగర్లోని 29వ డివిజన్ కిసాన్ నగర్ లో కాంగ్రెస్ నాయకుడు తాండ్ర శంకర్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ కార్యాలయాన్ని రాజేందర్ రావు ప్రారంభించారు. అనంతరం బస్తిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు డివిజన్ కాంగ్రెస్ నాయకులు మహిళలు ప్రజలు రాజేందర్రావుకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. 29వ డివిజన్ కిసాన్ నగర్ లో రాజేందర్రావు ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెలిచాల రాజేందర్రావు మాట్లాడుతూ సర్వే ఆధారంగా అధిష్టానం టికెట్లు కేటాయిస్తుందని తెలిపారు. అన్నింటినీ పరిగణలోకి తీసుకొని టికెట్లను అందిస్తుందన్నారు. గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు నిరంతరం శ్రమించిన జీడి రమేష్ కల్వల రామచందర్ మహేష్ లాంటి సీనియర్ నేతలకు నామినేటెడ్ పదవులు దక్కేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తాను ప్రమాణం చేసి ఈ విషయాన్ని మనస్ఫూర్తిగా చెబుతున్నానని తెలిపారు. అనేక ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీలో కష్టపడుతున్నారని వారి కష్టానికి ఫలితం కొద్ది రోజుల్లో దక్కనుందని ఉందని రాజేందర్రావు పేర్కొన్నారు. కష్టపడ్డ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని వారిని ఆర్థికంగా రాజకీయంగా అన్ని విధాలా బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు. ఎవరు కూడా నిరుత్సాహపడవద్దని కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ముందుండి కృషి చేయాలని కోరారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. బస్తి బాట కార్యక్రమానికి డివిజన్ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాండ్ర శంకర్ బాబు, గసికంటి కుమారు జీడి రమేష్ గండి రాజేశ్వర్ గండి శ్యామ్ గండి గణేష్ వెలిచాల రాజేందర్ రావు యువసేన జిల్లా అధ్యక్షుడు కాసారపు కిరణ్ కుమార్, గోశిక శంకర్ సముద్రాల అజయ్ వడ్లూరి శ్రీనివాస్ వివిధ కుల సంఘాల నాయకులు, ఇతర నాయకులు, మహిళలు డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# యువతకు విద్య ఎంత ముఖ్యమో, క్రిడలు కూడా అంతే ముఖ్యం

**అమనగల్లు, మహా :** యువతకు విద్య ఎంత ముఖ్యమో, క్రిడలు కూడా అంతే ముఖ్యమని ఆకుతోటపల్లి సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో ఆకుతోటపల్లి క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్ 4లో గెలిచిన విజేతలకు స్పాన్సర్ ఆకుతోటపల్లి సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి నగదు బహుమతులతో పాటు షీల్డ్ లు, మెడల్స్ అందజేశారు. విజేతగా నిలిచిన స్టార్ యూత్ అసోసియేషన్ జట్టు కు 8000 రూ, ద్వితీయ స్థానంలో నిలిచిన ఈగల్స్ జట్టు కు 5000 రూ, తృతీయ స్థానంలో నిలిచిన విక్టర్ జట్టుకు 3000 రూపాయల నగదు బహుమతులతో పాటు జ్ఞాపికను నరేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామాలలో యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, మంచి ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కో అప్షన్ సభ్యులు హాజీ పాషా, ఉపసర్పంచ్ శ్రీను, వార్డు సభ్యులు సాజిద్, విజయ్, కృష్ణయ్య, బాలు, మాజీ సర్పంచ్ రామచంద్రి, మల్లేష్, క్రీడా జట్లు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ఎమ్మెల్యే కసిరెడ్డి జన్మదిన వేడుకలు



**ఆమనగల్లు, మహా :** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు, తలకొండపల్లి ఎక్స్ రోడ్, కడ్తాల్ మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన కేకులను ఆయన కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ ఆలయంలో సతీసమేతంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యేను పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు.




# నిజాలు నిర్భయంగా రాసినప్పుడే జర్నలిస్టుల కష్టానికి నిజమైన ఫలితం : ఆచారి

**ఆమనగల్లు, మహా :** కల్వకుర్తి నియోజకవర్గ జర్నలిస్టులు నిజాలను వెలికి తీయడంలో కీలకపాత్ర పోషిస్తారని మాజీ జాతీయ ఒబిసి కమిషన్ సభ్యుల ఆచారి పేర్కొన్నారు. ఆదివారం ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ సమీపంలో ప్రైవేట్ ఫంక్షన్ లో పాత్రికేయుల సంక్రాంతి సంబరాల నియోజకవర్గ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజవర్గ పాత్రికేయులను సన్మానించారు. ఎలాంటి భయభ్రాంతులకు లొంగకుండా తూటాలను అక్షరాలుగా మలుసుకొని సమాజంలో జరుగుతున్న అన్యాయాలను అక్రమాలను తమ పత్రికలు, మీడియా రూపకంగా, వార్తా స్టోరీల రూపంలో ఎప్పటికప్పుడు వెలికితీయాలని, సమాజంలో జర్నలిస్టు పాత్ర చాలా కీలకమని, సమాజానికి ఉపయోగపడేలా వార్తలు రాయాలన్నారు. సమాజ శ్రేయస్సుకు జర్నలిస్టులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నిజాలు నిర్భయంగా రాసినప్పుడే జర్నలిస్టుల కష్టానికి నిజమైన ఫలితం ఉంటుందన్నారు. గతంలో వార్తల కోసం కష్టపడ్డారని, ప్రసుత్తం కొంత మార్పు వచ్చిందన్నారు.

**కల్వకుర్తిని జిల్లా కేంద్రంగా, ఆమనగల్లులో వివిధ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి...**

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేపడుతుండగా అన్ని అర్హతలు ఉన్న కల్వకుర్తి పట్టణాన్ని జిల్లాగా ప్రకటించాలని బీజేపీ నేత జాతీయ బీసీ కమిషన్ మాజీ మెంబర్ తల్లోజు ఆచారి డిమాండ్ చేశారు...కల్వకుర్తి నియోజకవర్గం కేంద్రం లోని అమనగల్లు పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జిల్లాల పునర్విభజన చేపట్టేందుకు కసరత్తు చేస్తుండగా కల్వకుర్తి పట్టణాన్ని జిల్లాగా ఏర్పాటు చేయడానికి అన్ని అర్హతలు కలిగి ఉన్నాయని ఈ నియోజకవర్గానికి చెందిన జైపాల్ రెడ్డి తెలంగాణ ఏర్పాటులో ఎంతో కృషి చేశారని జైపాల్ రెడ్డి గుర్తుగా ఆయన పేరుతో ఈ జిల్లాను ఏర్పాటుచేయాలన్నారు. కల్వకుర్తిని జిల్లా కేంద్రంగా, ఆమనగల్లులో వివిధ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా తాము ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. కల్వకుర్తి ప్రాంతానికి చెందిన రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థానంలో ఉండి, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబాటుకు గురైందని, ఏ రాజకీయ పార్టీ లక్ష్యమైనా తమ ప్రాంత అభివృద్దే ధ్యేయమని అన్నారు. కల్వకుర్తిని వెంటనే జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, ఆమనగల్లు పట్టణంలో ఆర్డీఓ, సబ్‌రిజిస్ట్రేషన్, ఆర్టీఓ, సబ్ ట్రెజరీ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీటి ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అంగీకరించాలని పేర్కొన్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని అభినందించిన భువనేశ్వరి



**ఆమనగల్లు, మహా:** ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఏటా క్రమం తప్పకుండా రక్తదానం చేస్తున్న ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకర్ యాదిలాల్ ను ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అభినందించారు. ఎన్టీఆర్పై అభిమానంతో ఆయన కొనసాగిస్తున్న సేవా దృక్పథం స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ ఆదివారం ప్రశంసా పత్రాన్ని అందజేశారు. రక్తదానం చేయడం హర్షనీయమని కొనియాడారు. కార్యక్రమంలో టీటీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం**

తెలుగు రాష్ట్రాలకు నందమూరి తారకరామారావు అందించిన సేవలు చిరస్మరణీయమని టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి అండే కార్ యాదిలాల్ అన్నారు. తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్ గొప్ప మహానీయుడని ఆయన కొనియాడారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం దివంగత మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యాదిలాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హైదరాబాదులోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో యాది లాల్ పాల్గొని రక్తదానం చేశారు. ప్రతి ఏటా రక్తదానం చేస్తున్న యాది లాల్ ను ఈ సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి, టిడిపి పొలిట్ ట్ బ్యూరో సభ్యుడు బక్క నరసింహులు, అభినందించి ప్రశంస పత్రం అందజేశారు. పార్టీ తరపున చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. సామాజిక సేవ కార్యక్రమాలను ముందుండాలని ఈ సందర్భంగా భువనేశ్వరి సూచించారు. యాదిలాల్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని కల్పించిన ఘనత దివంగత ఎన్టీఆర్ కే దక్కింది అన్నారు. భారత రాజకీయాలకు భాష్యం చెప్పిన ఎన్టీఆర్ గొప్ప మహానీయుడని అన్నారు. టిడిపికి త్వరలోనే పూర్వ వైభవం వస్తుందని యాదిలాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా రాష్ట్ర నాయకులు అర్థం నర్సింహ, కండె సత్యనారాయణ, గాజుల పద్మనాభం, శ్రీనాథ్, పంచాక్షరి, సింహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# 111 జీవోకు తూట్లు పొడుస్తున్న అక్రమ నిర్మాణాదారులు..

- దమ్ముంటే ఆపాలని అక్రమ నిర్మాణదారులు సవాళ్లు..
- ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యం పట్టించుకోని అధికారులు
- 111 జీవో ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను సాగిస్తున్నారని అధికారులకు తెలియదా
- ఆరోపిస్తున్న స్థానిక ప్రజలు



**మొయినాబాద్ మహా:** 111 జీవోకు తూట్లు పొడుస్తున్న అక్రమ నిర్మాణదారులు నిర్మాణాలు ఆపడానికి దమ్మొంటే ముందుకు రావాలని అధికారులకు సవాలు విసురుతున్న అక్రమ నిర్మాణదారులు.. స్థానిక ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోకుండా నోటీసులతో కాలయాపన చేస్తున్నారని, 111 జీవోలో అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారని, అధికారులకు తెలియదా అని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 10,11, 149 సర్వే నంబర్లలో 111 జీవోకు విరుద్ధంగా అక్రమణ భవనాలు నిర్మిస్తున్నారు. అడ్డుకోవలసిన అధికారులు చోద్యం చూస్తుండడంతో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. జంట జలాశయాల పరిధిలో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు నాటి ప్రభుత్వం జారీ చేసిన 111 జీవో ఇంకా అస్తిత్వంలోనే ఉన్నప్పటికీ పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతుండటం విస్మయం గొలుపుతున్నది. హిమాయత్ నగర్ రెవెన్యూ పరిధిలో 111 జీవో పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకొని అక్రమ నిర్మాణాలను అధికారులు అడ్డుకొని మొయినాబాద్ మండల, మున్సిపాలిటీ పరిధిలోని ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, నిబంధనలకు విరుద్ధంగా చేపడితే అధికారులు తక్షణమే కూల్చివేయాలి. కానీ మొయినాబాద్ మండల, మున్సిపాలిటీ పరిధిలో అలా జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొయినాబాద్ మండల, మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# గ్రామ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

**ఆమనగల్లు మహా:** తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కురుమ సర్పంచ్ లకు హైదరాబాద్ లోని నాగోల్ లో ఎగ్గె మల్లేశం భవనంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావుపేట గ్రామ నూతనంగా ఎన్నికైన ఇమ్మిడి మహేష్ ను తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎగ్గే మల్లేశం హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు ధత్తత్రేయ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య , రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నూతన సర్పంచ్ లు గ్రామ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని, గ్రామ అభివృద్ధి తదితర సమస్యల పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో కురుమ సంగం రాష్ట్ర నాయకులు గొరిగే వెంకటయ్య ,మాజీ సర్పంచ్ కెంచ హైమావతి రమేష్ , వార్డు సభ్యులు గౌర్ల లింగం ,గ్రామ పెద్దలు ఇమ్మిడి రాములు ,బోడ వెంకటయ్య ,గొరిగే తిరుపత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్ టి రామారావు జయంతి వేడుకలు..

**ఆమనగల్లు, మహా:** స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి వేడుకలను ఆదివారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటి చెప్పిన మహనీయుడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొప్పు యాదయ్య, కండె భాస్కర్, వెంకటస్వామి గౌడ్, గుండమల్లా జగన్, జంగయ్య గౌడ్ ఉన్నారు.

# ఆరోపణలు రుజువు చేయ్ లేకుంటే క్షమాపణ చెప్ప

**చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పామెన్ భీంభరత్ ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సవాలు**



**మొయినాబాద్ మహా:** నాపై లేనిపోని ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే కాలె యాదయ్య వాటికి సంబందించి ఆరోపణలను రుజువు చేయాలని లేని పక్షంలో క్షమాపణ చెప్పాలని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పామెన భీంభరత్ కాలె యాదయ్యకు సవాలు విసిరారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో పోటి చేసే కాంగ్రెస్ అభ్యర్థులకు నియోజకవర్గ ఇంచార్జ్ గా తానే పార్టీ తరపున భీఫాంలు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆదివారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో విలేకరుల సమావేశంలో భీంభరత్ మాట్లాడుతూ తనపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని.. చేసిన ఆరోపణలు రుజువు చేయాలని లేకుంటే చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాను 2018 సంవత్సరంలో ఆగష్టు నెలలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమకుమార్ రెడ్డి సమక్షంలో దాదాపు 2 వేల మందితో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల అసెంబ్లీ టికెట్ కేఎస్. రత్నంకు ఇచ్చిందని ఎన్నికల్లో రత్నం ఓటమి తరువాత మోసం చేసి పార్టీని వీడిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పటి నుంచి పార్టీ అభివృద్ధికి పనిచేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో షాబాద్ మండలంలో కాంగ్రెస్ పార్టీ చెప్పడానికి కూడా బయపడిన సమయంలో అధిక స్థానాలను గెలిపించుకోవడం జరిగిందని చెప్పారు. 2014లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ద్వారా గెలిచిన కాలె యాదయ్య అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశాడని ఆరోపించారు. తనపై అనేక ఆరోపణలు చేపి పీడీ యాక్టు కేసులు. ఎన్ కౌంటర్ చేసేందుకు ప్రయత్నించాడని భీంభరత్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎమ్మెల్యేగా గెలు పొంది ఇతర పార్టీలకు వెళ్లిన ఆయన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అనేక రకాలుగా ఇబ్బందులుకు గురి చేశాడని, పార్టీనే నమ్ముకొని పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల సమస్యలను పరిష్కరిస్తూ పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్న తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న కాలె యాదయ్య వాటిని నిరూపించాలని లేకుంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ విషయాన్ని కాంగ్రెస్ అదిష్టానం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని చెప్పారు. పార్టీ పెద్దలు చెప్పిన విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నాని చెప్పారు. ముఖ్యమంత్రి, ఇతర పార్టీ నాయకుల మీద గౌరవంతో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ వెళ్తున్నట్లు తెలిపారు. నేను ఎవరీ దగ్గర డబ్బులు వసూళ్లు చేయాలేదని స్పష్టం చేశారు. కాలె యాదయ్య నువ్వు అబద్దాలు ఆడకుండా పనిచేసుకో. నా దగ్గరకు రాకు నాప్రతిష్టతను దెబ్బతీయాలని చూడకని హెచ్చరించారు.

# బిజెపికి గుడ్ బై చెప్పిన దోర్నాల ప్రదీప్..

- విద్యార్థి దశ నుండి సుదీర్ఘకాలం పనిచేసిన ప్రదీప్
- స్వలాభం కోసం కొందరి వ్యక్తుల వెక్కిలి చేష్టలు
- పార్టీ సిద్ధాంతాలను వక్రీకరించే వాళ్ళతో ఉండలేం.!



**రంగారెడ్డి జిల్లా మహా:** బిజెపిపై గౌరవంతో పార్టీ యొక్క సిద్ధాంతాల పట్ల ఆకర్షితునై పార్టీ కోసం అహర్నిశలు పనిచేయడం జరిగిందని దోర్నాల ప్రదీప్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలను వక్రీకరించే వాళ్ళ మధ్యలో ఇమడలేక, బిజెపి పార్టీకి రాజీనామా చేయడం జరిగిందని ప్రదీప్ వెల్లడించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ,

**విద్యార్థి దశ నుండి సుదీర్ఘకాలం పనిచేసిన ప్రదీప్...**

ఖానాపూర్ గ్రామానికి చెందిన దోర్నాల ప్రదీప్ విద్యార్థి దశ నుండి ఏబీవీపీలో పనిచేసి అనంతరం బీజేవైఎం బిజెపిలో సుదీర్ఘకాలం ప్రదీప్ పనిచేశారు. గత కొన్ని రోజులుగా గ్రామంలో జరుగుతున్న పరిణామాల పట్ల ప్రదీపుపై, పార్టీ మున్సిపాలిటీ నాయకులకు తప్పుడు సమాచారాలను అందించి పార్టీ నుంచి వైదొలిగించాలని కుట్రలు చేస్తున్నారని ప్రదీప్ ఆరోపణలు చేశారు. పార్టీలో సరైన నాయకత్వం లేకపోవడం కొందరు వ్యక్తులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, గ్రామంలో పార్టీ పరువు తీస్తూ వ్యవహరిస్తున్నారు. పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన ప్రదీప్ ను పార్టీ వదులుకోవడం పార్టీకే నష్టం వాటిల్లుతుందని తనకు వచ్చే నష్టం ఏమీ లేదని స్పష్టం లేదన్నారు.

**పార్టీ సిద్ధాంతాలను వక్రీకరించే వాళ్ళతో ఉండలేం.!**

ప్రదీప్ మాట్లాడుతూ... విద్యార్థి దశ నుండి తాను బిజెపి పట్ల గౌరవంతో పార్టీ యొక్క సిద్ధాంతాల పట్ల ఆకర్షితునై పార్టీ కోసం అహర్నిశలు పనిచేయడం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖానాపూర్ బిజెపి పార్టీలో నాయకత్వ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని ఆయన మండిపడ్డారు. పార్టీలో కొందరు వ్యక్తులు తమ స్వలాభం కోసం వ్యక్తులు వెక్కిలి చేష్టలు చేస్తున్నారని, దానికి తాను అడ్డు చెప్పడంతో తాను పార్టీలో ఉంటే వాళ్ళ ఆటలు సాగవని దురుద్దేశంతో దుర్మార్గమైన ఆలోచనతో, సంక్రాంతి పండుగ సందర్భంగా తన స్వగ్రామం ఖానాపూర్ లో నిర్వహించిన ముగ్గుల పోటీలలో పాల్గొన్నందుకు, తనపై పార్టీకి చెందిన కొందరు కుట్ర పని పార్టీ వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొంటున్నాడని, నాపై మున్సిపాలిటీ నాయకులకు తప్పుడు సమాచారం అందించి సస్పెండ్ చేయించడం జరిగింది. దీని నేను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని, ఇలాంటి దుర్మార్గపు ఆలోచనలు చేసే వాళ్ళ మధ్య పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లలేని పరిస్థితి ఎదురవుతుంది, కావున ఇలాంటి వాళ్ళతో పార్టీలో కొనసాగితే భవిష్యత్తు ఉండదు అనే ఆలోచనతో తానే బిజెపి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. తదుపరి తన భవిష్యత్తు ఏంది అనేది త్వరలో తెలియజేస్తానని ఆయన ఒక మాటలో తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

**ఆమనగల్లు, మహా:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి చెందినట్లు కడ్తాల్ సీఐ గంగాధర్ పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న మండలంలోని కర్కల్ పహాడ్ చౌరస్తా వద్ద బైకును కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు ప్రమాదంలో ఆమనగల్లు మండలం విఠాయిపల్లి గ్రామానికి చెందిన రాజ్ కుమార్ (24) బైక్ పై కడ్తాల్నుం డి విఠాయిపల్లి కి వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగిందని, ప్రమాదంలో రాజ్ కుమార్ కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం హైదరాబాద్ లోని ఉస్మానియా హాస్పిటల్ కి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు అరవింద్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

# మారుతున్న ఇష్టాలు.. వసతులకే ప్రాధాన్యం!



ఇంటి కొనుగోలుదారుల ఇష్టాలు మారుతున్నాయి. మొన్నటి వరకు ధరకు ప్రాధాన్యం ఇచ్చిన గృహ కొనుగోలుదారులు ఇప్పుడు వసతులను పరిగణలోకి తీసుకుంటున్నారు. ఇల్లు కొనేటప్పుడు ఆ ప్రాజెక్ట్ వరకు మాత్రమే పరిమితం కాకుండా చుట్టుపక్కల పరిసరాలను గమనిస్తున్నారు. మరీ ముఖ్యంగా విద్యా, వైద్యం వసతులు ఎలా ఉన్నాయనేది ప్రధానంగా చూస్తున్నారు. అత్యవసరంలో ఎంత సమయంలో ఆస్పత్రికి వెళ్ల వచ్చు? ఎంత దగ్గరలో ఆరోగ్య సేవలు ఉన్నాయో ఆరా తీస్తున్నారు. పెరిగిన ఆరోగ్య జాగ్రత్తలలో భాగంగా ఇంట్లో పిల్లలు, పెద్దల ఆరోగ్య అవసరాల రీత్యా వీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇల్లు విశాలంగా ఉండటమే కాదు, కమ్యూనిటీలో సకల సౌకర్యాలు ఉండాలనేది నేటి కస్టమర్ల డిమాండ్. పిల్లల కోసం క్రీడా సదుపాయాలు, పెద్దలకు క్లబ్‌హౌస్, జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి సదుపాయాలు ఉండాలని కోరుకుంటున్నారు. నివాస ప్రాజెక్ట్‌లలో ఎక్కువ స్థలం ఖాళీ వదిలి, పచ్చదనం అధికంగా ఉంటే అలాంటి కమ్యూనిటీలలో ఇంటిని కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపిస్తున్నారు. చిన్న కుటుంబాల నేపథ్యంలో పిల్లల ఆలనా పాలనా చూసే డే కేర్ సెంటర్లు ఉండాలని కస్టమర్లు భావిస్తున్నారు. భార్యభర్తలిద్దరూ ఆఫీసుకు వెళ్తే పిల్లలను చూసుకోవడం కష్టంగా మారుతోంది. వర్క్ ఫ్రం హోమ్ పద్ధతిలో ఇంటి నుంచే పనిచేస్తున్నా.. పిల్లలను చూసుకునే పరిస్థితి లేకుండా పోతోంది. అందుకే కమ్యూనిటీలలో డే కేర్ సదుపాయాలను ఉండాలని కోరుకుంటున్నారు. వీకెండ్ వసతులు అవసరమే.. ఇంటి నుంచి ఆఫీసు ఎంత దూరంలో ఉందనేది గృహ కొనుగోలుదారులు ప్రధానంగా చూస్తున్నారు. సిటీ ట్రాఫిక్‌లోనే అధిక సమయం వృథా అవుతోంది కాబట్టి.. దూరం, సమయం అనేది ప్రధానంగా మారాయి. అదే సమయంలో ప్రజారవాణా సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది పరిశీలించాకే ఇంటి కొనుగోలుపై నిర్ణయం తీసుకుంటున్నారు. వీకెండ్ వస్తే కుటుంబంతో కలిసి సమయం గడిపేందుకు షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్స్, రెస్టారెంట్లు, రిక్రియేషన్ క్లబ్స్ వంటివి ఎంత దూరంలో ఉన్నాయనేవి సైతం ఇంటి కొనుగోలుదారులు చూస్తున్నారు.

# కేంద్రం–రాష్ట్రాలు రెండూ లోటు తగ్గించుకోవాలి



భారతదేశ ఆర్థిక సుస్థిరతకు పెరుగుతున్న ఆర్థిక లోటు (Fiscal Deficit) ప్రధాన బలహీనతగా మారిందని కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) అర్వింద్ సుబ్రహ్మణియన్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి తమ లోటును తగ్గించుకోవాలని ఆయన సూచించారు. ఇటీవల 'భారతదేశ అభివృద్ధి మార్గం' అనే అంశంపై నిర్వహించిన ఓ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్తు కార్యాచరణపై పలు వ్యాఖ్యలు చేశారు.

**'ప్రికోసియస్ డెమోక్రసీ' ప్రభావం**

భారతదేశం అభివృద్ధికి ముందే పరిణతి చెందిన ప్రజాస్వామ్యం (Precocious Democracy)గా అవతరించిందని సుబ్రహ్మణియన్ అభివర్ణించారు. సమాజంలోని ప్రతి వర్గం నుంచి వచ్చే డిమాండ్లను ప్రజాస్వామ్యబద్ధంగా తీర్చాల్సి రావడం కీలకంగా మారుతుంది. ఇది దేశ ఆర్థిక అలవాట్లపై ప్రభావం చూపుతోందని వ్యాఖ్యానించారు. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత భారత ప్రభుత్వ లోటు సగటున జీడీపీలో 10 శాతం వరకు ఉంటోందన్నారు. మనతో సమానంగా ఎదుగుతున్న ఇతర దేశాలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువని ఆయన గుర్తుచేశారు.

**సంక్షేమ పథకాలపై సమీక్ష అవసరం**

ప్రస్తుతం భారతదేశం వేగవంతమైన ఆర్థిక వృద్ధిని సాధిస్తుండటం వల్ల ద్రవ్యలోటును తట్టుకోగలుగుతోందని ఆయన విశ్లేషించారు. అయితే, భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే కొన్ని చర్యలు తీసుకోవాలన్నారు. 'కేంద్రం, రాష్ట్రాలు రెండూ తమ ఆర్థిక లోటును క్రమంగా తగ్గించుకోవాలి. నగదు బదిలీ పథకాలు వంటి సంక్షేమ కార్యక్రమాలపై చేసే వ్యయాన్ని పునసమీక్షించాలి. కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ అవసరం లేకపోయినా, బాధ్యతాయుతమైన వ్యయం తప్పనిసరి' అని చెప్పారు.

## 10 ని.డెలివరీ నిలిపివేత.. పర్యవేక్షణ కఠినతరం




క్విక్ కామర్స్ రంగంలో డెలివరీ సిబ్బంది ఎదుర్కొంటున్న సవాళ్లు, వారి భద్రతపై కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణను మరింత కఠినతరం చేసింది. 10 నిమిషాల్లో డెలివరీ అనే ప్రచారాన్ని ప్లాట్‌ఫారమ్‌లు విరమించుకున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో గిగ్ వర్కర్ల పరిస్థితిపై కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ నిరంతరం నిఘా ఉంచింది. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే లేదా గిగ్ వర్కర్ల శ్రమను దోపిడీ చేసే అగ్రిగేటర్లపై కఠిన చర్యలు తప్పవని ఉన్నత స్థాయి వర్గాలు హెచ్చరించాయి. బ్రాండింగ్ మార్చినప్పటికీ డెలివరీ సిబ్బందిపై పని ఒత్తిడి తగ్గకపోవడం, ఐడీల బ్లాకింగ్ వంటి అంశాలపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. గిగ్ వర్కర్ల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియాతో జరిగిన సమావేశం అనంతరం బ్లింకిట్, జెప్టో వంటి సంస్థలు 10 నిమిషాల డెలివరీ ప్రకటనలను ఉపసంహరించుకున్నాయి. కేవలం ప్రకటనల మార్పుతోనే పని ఒత్తిడి తగ్గదని, వ్యాపార నమూనాల్లో మార్పులు రాకపోతే కార్మికులకు ముప్పు పొంచి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గిగ్ వర్కర్లతో సహా అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రారంభించిన 'స్కీమ్ టు ప్రొమోట్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయీస్ (స్ప్రీ)' పథకం మెరుగైన ఫలితాలను సాధిస్తోంది. అధికారిక గణాంకాల ప్రకారం, ఈ పథకం కింద ఇప్పటివరకు సుమారు 1.17 లక్షల మంది కొత్త యజమానులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. దీనివల్ల సంస్థల స్థాయిలోనే కార్మిక సంక్షేమానికి మార్గం సుగమమైంది. కేవలం యజమానులే కాకుండా, భారీ సంఖ్యలో ఉద్యోగులు కూడా ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇప్పటివరకు దాదాపు 1.03 కోట్ల మంది కొత్త ఉద్యోగులు ఈఎస్ఐ పరిధిలోకి చేరడం విశేషం. ప్రస్తుతం ఈ పథకం గడువు 2026 జనవరి చివరి వరకు అందుబాటులో ఉంది. గతంలో నమోదు కాని యజమానులు, ఉద్యోగులు ఎలాంటి జరిమానాలు లేదా శిక్షలు లేకుండా ఒకేసారి రిజిస్టర్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. పరిశ్రమ వర్గాలు, రాష్ట్ర ప్రభుత్వాల విజ్ఞప్తి మేరకు ఈ పథకం గడువును పొడిగించడం ద్వారా లక్షలాది మంది కార్మికులకు వైద్య, ఆర్థిక భద్రత చేకూరింది. గిగ్ ఎకానమీలో పారదర్శకత, కార్మిక సంక్షేమమే ధ్యేయంగా కేంద్రం ముందుకు సాగుతోంది.

## పెరిగిన బజాజ్ పల్సర్ ధరలు



బజాజ్ ఆటో.. ఎంపిక చేసిన పల్సర్ మోడళ్ల ధరలను రూ.461 నుంచి రూ.1,460 వరకు పెంచింది. పెరిగిన ధరల కారణంగా.. చాలా బైకుల రేట్లు మారిపోయాయి. ఎంట్రీ లెవల్ పల్సర్ 125 సిరీస్‌లో, నియాన్ సింగిల్ సీట్ వేరియంట్ ధర ఇప్పుడు రూ.79,048 నుంచి రూ.79,939కి పెరిగింది. కార్బన్ ఫైబర్ సింగిల్ సీట్ ధర రూ.85,633 నుంచి రూ.86,411కి పెరిగింది, కార్బన్ ఫైబర్ స్ప్లిట్ సీట్ ధర రూ.87,527 నుంచి రూ.88,547కి పెరిగింది. పల్సర్ N125 బైక్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. అయితే NS125 బేస్ వేరియంట్ ధర రూ. 91,182 నుంచి రూ. 92,642కు చేరింది. LED BT రూ. 93,792 నుంచి రూ. 94,253లకు, LED BT ABS రూ. 98,400 నుంచి రూ. 98,955లకు చేరింది. పల్సర్ 150 సింగిల్‌డిస్క్ & ట్విన్‌డిస్క్ వేరియంట్ల ధరలు వరుసగా రూ.1,11,669 & రూ.1,15,481 వద్ద (వీటి ధరల్లో ఎటువంటి మార్పు లేదు) అలాగే ఉన్నాయి. పల్సర్ NS160, NS200, RS200 ధరలు రూ.702 చొప్పున పెరిగి, ఇప్పుడు రూ.1,20,873, రూ.1,32,726 & రూ.1,71,873 వద్ద ఉన్నాయి. డిసెంబర్ 2025లో 2026 అప్‌డేట్ తర్వాత పల్సర్ 220F రూ.1,28,490 నుంచి రూ.1,29,186లకు చేరింది. 250cc విభాగంలో, పల్సర్ N250 ధర రూ.1,34,166 కాగా, టాప్ ఎండ్ పల్సర్ NS400Z ధర రూ.1,93,830 వద్ద ఉంది.




# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# పాక్‌లో నన్ను వేధిస్తున్నారు

### మహిళ ఆడియో టేప్ వైరల్



సర్‌భ్‌జిత్ కౌర్ అనే మహిళ సిక్కుల తీర్థయాత్ర కోసం పాకిస్థాన్‌కు వెళ్లి అక్కడే ఒక పాకిస్థానీని వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా ఈ వ్యవహారం అప్పట్లో సంచలనం సృష్టించింది. అయితే తాజాగా ఆ మహిళ పేరుతో వచ్చిన ఓ ఆడియో టేప్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పంజాబ్ రాష్ట్రం కపుర్తలా జిల్లా అమ్నిపూర్ గ్రామానికి చెందిన సర్‌బ్‌జిత్ కౌర్.. సిక్కుల మత గురువు గురునానక్ జయంతి ఉత్సవాలను జరుపుకోవడానికి గతేడాది నవంబర్‌లో వాఘబార్డర్ మీదుగా పాకిస్థాన్‌లోకి ప్రవేశించింది. ఆ తీర్థయాత్రకోసం దాదాపు 2 వేల మంది భక్తులు పాకిస్థాన్ వెళ్లగా అందరూ తిరిగి వచ్చారు. అయితే సర్‌బ్‌జిత్ రాకపోవడంతో వారి కుటుంబసభ్యులు పోలీసులను సంప్రదించగా వారు విచారించారు. అప్పుడు ఆమె అక్కడే నశీర్ హుస్సేన్ అనే వ్యక్తిని వివాహం చేసుకుందని తెలిసింది. దీంతో అందరూ షాక్‌కు గురయ్యారు. తాజాగా ఇప్పుడు ఆమె పేరుతో ఒక ఆడియో టేప్ వైరల్ అవుతోంది. అందులో అక్కడ తాను అస్సలు బాగాలేనని తాను పెళ్లి చేసుకున్న వ్యక్తితో పాటు అతని కుటుంబం తనను చిత్రహింసలకు గురిచేస్తోందని అన్నట్లు ఉంది. దయచేసి తనను తిరిగి ఇండియా తీసుకెళ్లాలని తన భారత్‌లో ఎటువంటి హాని చేయనని ఆమె అందులో అన్నారు. తన పిల్లలను చూడాలని ఉందని ఎంతోమందికి లక్షల రుపాయలు దానంగా ఇచ్చిన తను ఇప్పుడు డబ్బుల కోసం వేడుకోవాల్సి వస్తోందని ఆడియోలో పేర్కొన్నారు. అయితే ఈ ఆడియో క్లిప్ సర్‌బ్‌జిత్ కౌర్‌కు చెందిందా కాదా అనే విషయం పోలీసులు అధికారికంగా ధృవీకరించలేదు. అయితే సర్‌బ్‌జిత్ కౌర్ వివాహం అనంతరం అక్కడి పోలీసులు వారిపై దాడి చేసి పెళ్లిని రద్దు చేసుకోవాలని కోరినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును విచారించిన లాహెర్ కోర్టు సర్‌భ్‌జిత్‌ని అక్కడి ప్రభుత్వ వసతి గృహానికి తరలించినట్లు అక్కడి తెలిపారు. అయితే కౌర్‌ను ఇది వరకే పాకిస్థాన్ నుంచి పంపించాలని ప్రయత్నించగా వాఘా బార్డర్ మూసివేయడంతో అది సాధ్యపడలేదని అక్కడి అధికారులు అన్నారు.



## సిరియాపై ఉరిమిన అమెరికా..

# ఉగ్ర నేత హతం!

**డమాస్కస్:** అల్‌ఖైదా అనుబంధ నేతపై అమెరికా తన భీకర పంజా పంజా విసిరింది. ఇటీవల ఇద్దరు అమెరికన్ సైనికులు, ఒక పౌరుని మృతికి కారణమైన ఐసిస్ (ఐఎస్ఐఎస్) ఉగ్రవాదులతో సంబంధం ఉన్న అల్‌ఖైదా నేతను లక్ష్యంగా చేసుకుని అమెరికా బలగాలు విరుచుకుపడ్డాయి. శుక్రవారం సిరియాలో జరిపిన ఈ మెరుపు దాడిలో ఆ ఉగ్ర నేత హతమైనట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ఆపరేషన్‌పై యూఎస్ సెంట్రల్ కమాండ్ (CENTCOM) కీలక వివరాలను వెల్లడించింది. జనవరి 16న జరిపిన ఈ దాడిలో 'బిలాల్ హసన్ అల్‌జాసిమ్' అనే కీలక ఉగ్రవాద నేత హతమయ్యాడు. ఇతను ఉగ్ర దాడులకు కుట్రలు పన్నడంలో ఆరితేరినవాడని, 2025, డిసెంబర్ 13న సిరియాలోని పల్మైరాలో సార్జెంట్ ఎడ్గార్ బ్రియాన్ టోర్రెస్ టోవర్, సార్జెంట్ విలియం నథానియల్ హోవార్డ్, ఇంటర్‌ప్రెటర్ అయద్ మన్సూర్ సకత్‌లను బలిగొన్న ఐసిస్ ఉగ్రవాదితో ఇతనికి ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని సెంట్రల్ కమాండ్ పేర్కొంది. తమ పౌరుల మరణానికి కారణమైన వారిని వదిలిపెట్టేది లేదని అమెరికా సెంట్‌కామ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ పేర్కొన్నారు. అమెరికన్ పౌరులు లేదా సైనికులపై దాడులకు ప్లాన్ చేసే వారికి, దాడులు చేసే వారికి ప్రపంచంలో ఎక్కడా సురక్షిత స్థానం ఉండదని, వారిని ఎక్కడున్నా వేటాడుతామని ఆయన హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు చేపట్టిన 'ఆపరేషన్ హాక్ ఐ స్ట్రైక్'లో భాగంగానే ఈ తాజా దాడి జరిగింది. బషర్ అసద్ పాలన ముగిసిన అనంతరం తిరిగి పుంజుకోవడానికి ప్రయత్నిస్తున్న ఐసిస్ మూకలను అణచివేయడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ కొనసాగుతోంది. జార్డాన్, సిరియా తదితర భాగస్వామ్య దేశాల సహకారంతో అమెరికా ఇప్పటివరకు 100కు పైగా ఐసిస్ మౌలిక సదుపాయాలు, ఆయుధ కేంద్రాలపై 200కు పైగా ఖచ్చితమైన దాడులు నిర్వహించింది. గత ఏడాది కాలంలో సిరియా వ్యాప్తంగా 300 మందికి పైగా ఐసిస్ కార్యకర్తలను బంధించామని, ప్రాంతీయ భద్రతకు ముప్పుగా ఉన్న 20 మందికి పైగా ఉగ్రవాదులను హతమార్చామని సెంట్‌కామ్ వెల్లడించింది.

# భారత్ నుంచే అమెరికాకు సంపద




ప్రస్తుతం పాకిస్తాన్ అమెరికా సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంతగా బలపడ్డాయి. డొనాల్డ్ ట్రంప్, పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌తో భేటీ అవ్వడం పలుమార్లు ఆ దేశానికి మద్దతుగా మాట్లాడడం జరిగింది. దీంతో భారత్ యూఎస్‌తో కొంత డిస్టెన్స్ పెంచింది. ఈ నేపథ్యంలో అమెరికా రిపబ్లికన్ ఎంపీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అమెరికాకు ఇండియాతోనే స్నేహం బాగుంటుందని అక్కడి నుండే భారత్‌కు సంపద, శాంతి లభించాయన్నారు. భారత్ అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ఆ దేశ రిపబ్లికన్ పార్టీ ఎంపీ మెక్ కార్మిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు పాకిస్థాన్‌తో కంటే భారత్‌తోనే రిలేషన్ బాగుంటుందన్నారు. అమెరికాకు పెట్టుబడులు వచ్చేవి భారత్ నుంచి తప్ప.. పాక్ నుంచి కాదని 'సెంటర్ ఫర్ స్ట్రాటజీస్‌అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్' నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలో అత్యధిక ప్రజలు మధ్యతరగతి కుటుంబానికి చెందినవారని ప్రపంచంలోని మిడిల్ క్లాస్ మార్కెట్‌ని భారత్ డామినేట్ చేస్తుందని తెలిపారు. ఇండియాలోని ప్రతిభావంతులైన యువత అమెరికాకు వచ్చి దేశ ఆర్థిక అభివృద్ధిలో భాగం పంచుకుంటున్నారని మెక్ కార్మిక్ అన్నారు. అయితే ఇటీవల భారత్‌లోని యుఎస్ రాయబారి సైతం భారత్‌కు అనుకూలంగా మాట్లాడారు.

అమెరికాకు భారత్ తర్వాతే మరే దేశమైనా అని అన్నారు.కాగా ప్రస్తుతం భారత్‌అమెరికా మధ్య సంబంధాలు అంత మెరుగ్గా లేవు. ట్రంప్ ప్రభుత్వం భారత్ నుంచి ఎగుమతయ్యే వస్తువులపై 50 శాతం పన్ను విధిస్తోంది.దీంతో ఎగుమతులు మందగించి దేశంలో చాలామంది ఉపాధి కోల్పోయారు.



# కుండపోత వర్షాలు.. 100 మంది మృతి!


ఆఫ్రికా దక్షిణ ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షా లు కురుస్తున్నాయి. కుండపోత వర్షా ల కారణంగా దాదాపు 100 మందికి పైగా మృతి చెందారు. లక్షల సంఖ్యలో ప్రజలు ఆశ్రయం కోల్పోయారు. మరోవైపు.. రానున్న రోజుల్లో మరింత ఎక్కువగా వర్షా లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఆఫ్రికాలోని మొజాంబిక్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా దేశాలలో ఎడతెరిపిలేని కుండపోత వర్షా లు కురుస్తున్నాయి. మొజాంబిక్‌లో వర్షా లు, వరదల కారణంగా రెండు లక్షల మందికి పైగా ప్రభావితులు అయ్యారు. భారీ వర్షా ల కారణంగా వేల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. వర్షా ల కారణంగా ఇప్పటికే వంద మందికిపైగా మృతి చెందారు. ఇక, జింబాబ్వేలో వర్షా ల వల్ల 70 మంది మరణించగా.. 1000కి పైగా ఇళ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. పాఠశాలలు, రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఇదిలా ఉండగా.. దక్షిణ ఆఫ్రికాలో మృతుల సంఖ్య 30 చేరింది. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. హెలికాప్టర్లను రంగంలోకి దించి, బాధితుల్ని రక్షిస్తున్నారు. ప్రఖ్యాత క్రుగార్ నేషనల్ పార్క్‌ను కూడా ఈ వరదలు ప్రభావితం చేశాయి. అందులో చిక్కుకున్న 600 మంది పర్యాటకులు, పార్కు సిబ్బందిని సహాయక బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. లా నినా వల్ల వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల ఆఫ్రికాలోని ఏడు దేశాలను వర్షా లు ముంచెత్తుతున్నాయని అమెరికా వాతావరణ హెచ్చరికల వ్యవస్థ తెలిపింది. రానున్న రోజుల్లో మరింత ఎక్కువగా వర్షా లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# నటి శారదకు అత్యున్నత పురస్కారం


అభినేత్రి శారద పేరు తెలుగు పరిశ్రమలో ఎప్పటికీ చెరిగిపోని పేరు. ఆమె ఒక నట గ్రంథాలయం. ఆరు పదుల సినీ ప్రయాణంలో ఎన్నో అద్భుతమైన పాత్రలకు జీవం పోశారు. 'కల్యాశుల్కం' చిత్రంతో వెండితెరకు పరిచమైన శారద.. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో నటించి ఎనలేని అభిమానులను సంపాదించుకున్నారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలని మన పెద్దలు చెబుతారు. అయితే, శారద మాత్రం ముందు రచ్చ గెలిచి ఆ తరువాతే ఇంట గెలిచారు. శారద తెలుగు నటే కానీ, మలయాళ చిత్ర పరిశ్రమలో స్టార్ రేంజ్‌కు చేరుకున్నారు. జాతీయ స్థాయి ఉత్తమ నటిగా పేరుపొందిన ఆమెకు పుట్టిల్లయిన తెలుగు చిత్ర పరిశ్రమ తన ప్రతిభకు పట్టాభిషేకం చేసింది.

**'జేసీ డానియల్ అవార్డు - 2024'కు శారద ఎంపిక**

తాజాగా కేరళ ప్రభుత్వం శారదను గౌరవించనుంది. మలయాళ చిత్ర పరిశ్రమకు ఆమె అందించిన సేవలకు గుర్తుగా కేరళ ప్రభుత్వం అందించే అత్యున్నత సినిమా పురస్కారం 'జేసీ డానియల్ అవార్డు 2024'కు ఆమె ఎంపికయ్యారు. జనవరి 25న తిరువనంతపురంలో కేరళ రాష్ట్ర చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని శారద అందుకుంటారు. ఈ వార్త తెలిసిన వెంటనే శారద స్పందించారు. ఈ అవార్డ్‌కు తనను ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. తనపై మలయాళ చిత్రసీమతో పాటు అక్కడి ప్రేక్షకులు చూపిన ప్రేమను తన ఆఖరి శ్వాస వరకు మర్చిపోనని ఆమె అన్నారు. మలయాళ ప్రేక్షకులు లేకపోతే తన కెరీర్ లేదని పేర్కొన్నారు. తన సినీ కెరీర్ ఆరంభంలో తెలుగులో కొన్ని చిత్రాల్లో కామెడీ వేషాలు మాత్రమే దక్కాయని, ఆ పాత్రలు కూడా ఈ అమ్మాయికి సరిగా చేయడం లేదని చాలామంది మేకర్స్ అన్నారని గుర్తుచేసుకున్నారు. సినిమా ఛాన్స్‌లు లేని సమయంలో మలయాళంలో 'శాకుంతల' అనే సినిమా తనకు ఊపిరిపోసిందన్నారు. అలా జాతీయ అవార్డ్ అందుకునే రేంజ్‌కు మలయాళ పరిశ్రమ తనను తీసుకెళ్లిందని ఆమె అన్నారు. మలయాళ ప్రముఖ దర్శక నిర్మాత కుంజాకో తన ప్రతిభను గుర్తించారని ఆయన్ను ఎప్పటికీ మరిచిపోలేనని శారద తెలిపారు. తెలుగులో అమ్మ రాజీనామా, మేజర్ చంద్రకాంత్, దాన వీర శూర కర్ణ, తెనాలి రామకృష్ణ, స్వయంవరం ,నిమజ్జనం , జస్టిస్ చౌదరి, సర్దార్ పాపారాయుడు, స్టాలిన్, యోగి వంటి ఎన్నో మంచి పాత్రలు చేసిన సినిమాలు ఉన్నాయి.








# పుష్ప రాజ్ హవా తగ్గేదే లేదు ..


భారతీయ సినీ పరిశ్రమలో ప్రస్తుతం అత్యంత ప్రభావవంతమైన స్టార్లలో అల్లు అర్జున్ ముందు వరుసలో నిలిచారు. 'పుష్ప' సిరీస్‌తో ఆయన సంపాదించిన గుర్తింపు కేవలం ఒక సినిమా విజయంగా కాకుండా, ఒక ఫెనామెనాన్‌గా మారింది. ముఖ్యంగా 'పుష్ప 2: ది రూల్' దేశవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తుడిచిపెట్టేసి, రూ.1800 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లతో తెలుగు సినీ చరిత్రలోనే టాప్ విజయాల్లో ఒకటిగా నిలిచింది. ఈ విజయంతో బన్నీ క్రేజ్ నార్త్ నుంచి సౌత్ వరకూ మరింత విస్తరించింది.ఇంతటి సక్సెస్ తర్వాత పుష్ప కథ ఇక్కడితో ముగుస్తుందనే అభిప్రాయం మొదట వినిపించినా, దర్శకుడు సుకుమార్ మాత్రం అభిమానులను మరోసారి షాక్ ఇచ్చారు.

'పుష్ప 2' క్లైమాక్స్‌లోనే మూడో భాగానికి స్పష్టమైన సంకేతం ఇస్తూ 'పుష్ప 3: ది ర్యాంపేజ్' అనే టైటిల్‌ను రివీల్ చేయడం సినిమాపై ఉన్న ఆసక్తిని మరింత పెంచింది. థియేటర్లలో ఆ సీన్ పడిన క్షణం నుంచి సోషల్ మీడియాలో ఊహాగానాలు జోరందుకున్నాయి. తాజాగా వైరల్ అవుతున్న కథనాల ప్రకారం, మూడో భాగంలో పుష్ప రాజ్ పాత్ర మరింత క్రూరంగా, వ్యూహాత్మకంగా మారనుందట. ప్రాణాపాయం నుంచి బయటపడ్డ తర్వాత తన ఎర్రచందనం సామ్రాజ్యాన్ని సంపూర్ణంగా నియంత్రించుకోవడమే కాకుండా, తనను మోసం చేసిన వారిపై కూడా పుష్ప ప్రతీకారం తీర్చుకుంటాడనే టాక్ వినిపిస్తోంది. ఈ భాగంలో పుష్పకు ఎదురయ్యే శత్రువులు కేవలం బయటవాళ్లే కాకుండా, లోపలే ఉన్న ద్రోహులేననే అంశం కథకు ప్రధాన బలం కావచ్చని సమాచారం.

ఇప్పటికే ఈ స్క్రిప్ట్ పనులు గోప్యంగా జరుగుతున్నాయని, హైదరాబాద్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యాలయంలో సుకుమార్ టీమ్ కథను మరింత బలంగా మలుస్తోందని ప్రచారం జరుగుతోంది. ఈ ఒక్క లీక్‌తోనే పుష్ప 3పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇదిలా ఉండగా 'పుష్ప 2' జపాన్‌లో 'పుష్ప కున్రిన్' పేరుతో విడుదలై అక్కడ కూడా మంచి స్పందన తెచ్చుకుంటోంది. విదేశీ మార్కెట్ల నుంచి వస్తున్న ఆదరణ ఈ ఫ్రాంచైజ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చేస్తోంది. ఇదే ఊపులో పుష్ప 3 షూటింగ్ 2027 వేసవిలో ప్రారంభమయ్యే అవకాశం ఉందన్న ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. పుష్ప 3 సెట్స్‌పైకి వెళ్లేలోపు అల్లు అర్జున్ మరికొన్ని భారీ ప్రాజెక్టులను పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీతో తన 22వ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి హాలీవుడ్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు పనిచేస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. అంతేకాదు, లోకేష్ కనగరాజ్‌తో కూడా ఓ భారీ ప్రాజెక్ట్ లైనప్‌లో ఉంది.

## సంక్రాంతి బరిలో చిరంజీవి హవా..

# ఆరు రోజుల్లో బ్రేక్ ఈవెన్..!



ఈ సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవి మార్కెట్ స్ట్రెంగ్త్‌పై ఎలాంటి సందేహాలకు తావు లేకుండా స్పష్టత వచ్చింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'మన శంకర వరప్రసాద్ గారు (MSG)' విడుదలైనప్పటి నుంచే బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ దూసుకుపోతోంది. భారీ సినిమాల పోటీ మధ్యలోనూ ఈ చిత్రం రోజురోజుకూ కలెక్షన్లను పెంచుకుంటూ వెళ్లడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తాజాగా మేకర్స్ విడుదల చేసిన అధికారిక అప్‌డేట్ ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.261 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. పండగ సెలవులను పూర్తిగా వినియోగించుకున్న ఈ మూవీ, విడుదలైన మొదటి వారంలోనే అసాధారణ రన్‌ను నమోదు చేసింది. చిరంజీవి స్టామినా ఇంకా తగ్గలేదని చెప్పడానికి ఇది గట్టి ఉదాహరణగా నిలుస్తోంది. 'MSG' సాధించిన మరో కీలక మైలురాయి ఏమిటంటే... అన్ని ఏరియాల్లో ఆరు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ పూర్తి చేయడం. సాధారణంగా భారీ బడ్జెట్ చిత్రాలు సేఫ్ జోన్‌లోకి రావడానికి కనీసం పది రోజులు నుంచి రెండు వారాల సమయం పడుతుంది. కానీ ఈ సినిమా మాత్రం రికార్డ్ వేగంతో లాభాల బాట పట్టిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో బయ్యర్లకు ముందుగానే పండగ లాభాలు కనిపిస్తున్నాయి. దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాల్లోనూ 'MSG'కు గట్టి ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో చిరంజీవి గత రికార్డులను దాటేస్తూ, కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. త్వరలోనే అక్కడ 3 మిలియన్ డాలర్ల మార్క్‌ను టచ్ చేసే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ అనలిస్టులు అంచనా వేస్తున్నారు.

థియేటర్లతో పాటు ఆన్‌లైన్ టికెట్ ప్లాట్‌ఫామ్స్‌లోనూ 'MSG' హవా కొనసాగుతోంది. బుక్ మై షో వంటి యాప్స్‌లో భారీ అడ్వాన్స్ బుకింగ్స్ నమోదవుతూ, పాత రికార్డులను బద్దలు కొడుతోంది. వీకెండ్ అడ్వాన్స్ ట్రెండ్ చూస్తే, వచ్చే రోజుల్లో కూడా కలెక్షన్లు స్ట్రాంగ్‌గా కొనసాగనున్నట్లు తెలుస్తోంది. ఆరు రోజుల్లోనే రూ.261 కోట్ల మార్క్ దాటడంతో, 300 కోట్ల క్లబ్‌లోకి ఎంటర్ కావడం పెద్ద విషయం కాదని మేకర్స్ ధీమాగా ఉన్నారు. ఒక రీజినల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం టాలీవుడ్‌కు అరుదైన ఘనతగా మారింది. పూర్తి రన్‌లో ఈ సినిమా ఇండస్ట్రీ హిట్ ట్రాక్‌లోకి వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, 2026 ఆరంభంలోనే మెగాస్టార్ చిరంజీవి టాలీవుడ్‌కు స్ట్రాంగ్ ఓపెనింగ్ ఇచ్చారని చెప్పవచ్చు. ఇప్పుడు ఈ జోరు చూసిన తర్వాత, చిరంజీవి కుటుంబం నుంచి రాబోయే తదుపరి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తాయో అన్న ఆసక్తి ప్రేక్షకుల్లో మరింత పెరుగుతోంది.

# మరో వారసురాలు వచ్చేస్తుంది



చిత్ర పరిశ్రమలో వారసుల తెరంగేట్రం అన్నది సర్వసాధారణ విషయం. అలా ఇప్పుడు నటి ఊర్వశి వారసురాలు కథానాయకిగా ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతున్నారనేది తాజా సమాచారం. మాలీవుడ్‌కు చెందిన ఊర్వశి మాతృభాషతో పాటు తమిళం, తెలుగు భాషల్లో పలు చిత్రాల్లో కథానాయకిగా నటించి పేరుగాంచారు. 45 ఏళ్లుగా కళామతల్లికి సేవలు అందిస్తున్న ఊర్వశి మలయాళ నటుడు మనోజ్ కె.జయన్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత విడిపోయారు. వీరికి తేజలక్ష్మి అనే కూతురు ఉంది. ఈ బ్యూటీ ఇప్పుడు కథానాయకిగా నటించడానికి సిద్ధమవుతున్నారు. దర్శకుడు కె.భాగ్యరాజ్ దర్శకత్వంలో ముందనేముడిచ్చి చిత్రం ద్వారా ఊర్వశి కథానాయకి కోలీవుడ్‌కు పరిచయం అయ్యారు. అయితే ఈమె కమలహాసన్‌ను తన గురువుగా భావిస్తారు. ఆయనతో కలిసి పలు చిత్రాల్లో నటించారు. త్వరలో కథానాయకిగా పరిచయం కాబోతున్న తేజలక్ష్మి కమలహాసన్ ఆశీస్సులు పొందడానికి చాలాకాలంగా ప్రయత్నిస్తున్నారట. దీంతో కూతురు కోరికను నెరవేర్చడానికి ఇటీవల ఊర్వశి ఆమెను తీసుకొని కమలహాసన్ ఇంటికి వెళ్లారు.

అలా ఆయన ఆశీస్సులు పొందిన తేజలక్ష్మి తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ తాను చిన్నతనంలో కమలహాసన్ నటిస్తున్న చిత్రాలు షూటింగ్‌కు అమ్మతో కలసి వెళ్లేదాన్నని ,అప్పుడు కమలహాసన్ షూటింగ్ విరామం సమయాల్లో తనను ముద్దాడుతూ తిప్పేవారన్న విషయాన్ని అమ్మ చెప్పేది అన్నారు. దీంతో ఇటీవల కమల్‌ను కలుసుకోవాలని కోరిక బలంగా ఏర్పడిందన్నారు. అది నెరవేరడం సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ఊర్వశి, తేజలక్ష్మి కమలహాసన్‌తో దిగిన ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.



# నిర్మాతతో డేటింగ్ రూమర్స్..

బాలీవుడ్ ఐటమ్ గర్ల్‌గా పేరు సంపాదించుకున్న బ్యూటీ నోరా ఫతేహి. పలు సూపర్ హిట్ సినిమాల్లో ఐటమ్ సాంగ్స్‌లో అభిమానులను మెప్పించింది. తన గ్లామర్‌తో బాలీవుడ్ సినీ ప్రియులను అలరించింది. ప్రస్తుతం ఈ బాలీవుడ్ ముద్దుగుమ్మ కన్నడ చిత్రం కేడీ: ది డెవిల్, తమిళ చిత్రం కాంచన 4లో కనిపించనుంది. అయితే సినీ కెరీర్ సంగతి పక్కన పెడితే.. ఇటీవల నోరాపై రూమర్స్ తెగ వైరలవుతున్నాయి. ప్రముఖ టి సిరీస్ ఛైర్మన్, ఎండీ భూషణ్ కుమార్‌తో రిలేషన్‌పై ఉన్నారని వార్తలొస్తున్నాయి. తాజాగా వీటిపై నోరా స్పందించింది. ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ రెడ్డిట్ పోస్ట్ స్క్రీన్‌షాట్‌ను షేర్ చేసింది. తనపై వచ్చిన వీడియోను చూసి వావ్ అంటూ స్మైలీ ఎమోజీని జోడించింది. దీంతో నోరా ఫతేహి టాపిక్ బాలీవుడ్ చర్చనీయాంశంగా మారిపోయింది. కాగా.. 2005లో నటి దివ్య ఖోస్లాను భూషణ్ కుమార్ వివాహం చేసుకున్నారు. వీరికి 2011లో ఒక కొడుకు జన్మించారు. అయితే తనపై వస్తున్న రూమర్స్‌పై భూషణ్ కుమార్ మాత్రం స్పందించలేదు. నోరా ఫతేహి వ్యక్తిగత జీవితం గురించి కొత్త కొత్త ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. గతంలో మొరాకో ఫుట్‌బాల్ క్రీడాకారుడు అచ్రాఫ్ హకీమి రిలేషన్‌లో ఉన్నారంటూ రూమర్స్ వచ్చాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com